ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 31 జనవరి 2025



నెల్లూరు : కనకమహల్ సెంటర్ వద్ద సుందరయ్య విగ్రహం చుట్టూ సీపీఎం జెండాల రెపరెపలు

కమ్యూనిస్టుల పురిటిగడ్డపై
మహా సంబరం!

- రేపటి నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు
- ఎన్నో ఉద్యమాలకు పుట్టినిల్లు సింహపురి
- నాటి పుచ్చలపల్లి నుంచి నిన్నటి జక్కా వెంకయ్య వరకు..
- ఆస్తులు వదులుకున్న ఎందరో త్యాగధనులు

ఉద్యమాల జిల్లా.. కమ్యూనిస్టు యోధుల పురిటిగడ్డ సింహపురి మహా సంబరానికి వేదిక కానుంది. నలభై ఐదేళ్ల తర్వాత నెల్లూరులో ఆ పార్టీ రాష్ట్ర మహాసభలు శనివారం నుంచి జరగనున్నాయి. మూడు రోజులపాటు జరిగే ఈ సభలకు రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు తరలిరానున్నారు. సుదీర్ఘ కాలం తర్వాత జరగనున్న ఈ సభలను విజయవంతం చేసేందుకు సీపీఎం శ్రేణులు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. ఇప్పటికే ప్రజానాట్యమండలి కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా జనసమీకరణ చేపట్టారు. కాగా, ఎన్నో ఉద్యమాలు పురుడుపోసుకున్న సింహపురిలో సీపీఎం ప్రాభవంపై ప్రత్యేక కథనం...

వివరాలు 6లో

గాంధీ మార్గాన్ని అనుసరిద్దాం

- ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ పిలుపు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం) జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సత్యం, ధర్మం, అహింస, సత్యాగ్రహం వంటి ఆయుధాలతో భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిన మహాత్ముడు గాంధీజీ అని, ఆయన చూపిన శాంతిమార్గంలో మనమందరం నడుద్దామని ఇన్చార్జి కలెక్టర్ కే.కార్తీక్ అన్నారు. గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ యావత్ భారతావనికి స్వేచ్ఛావాయువులు ప్రసాదించిన జాతి మార్గదర్శకుడు గాంధీజీ అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ మన జాతిపిత అనుసరించిన మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని సన్మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, కలెక్టరేట్ ఏవో విజయ్‌కుమార్, ఐఅండ్‌పీఆర్ డీడీ సదారావు తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖలో
ఇక అంతా సెన్సార్లే!

- ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్‌కు సర్వం సిద్ధం

నెల్లూరు (క్రైం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటివరకు అధికారుల కనుసన్నల్లో జరిగిన డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియ ఇకపై కెమెరాలు, సెన్సార్ల నిఘాలో ఉండబోతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లను రవాణా శాఖ సిద్ధం చేస్తోంది. తొలివిడతగా మొదటి విడతగా చిత్తూరు, అనంతపురం, కర్నూలు, విజయవాడ ప్రాంతాల్లో ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2వ విడతలో నెల్లూరును ఎంపిక చేశారు. నగరంలోని రవాణా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ ట్రాక్‌లో మొత్తం 13 సెన్సార్లు, 14 వీడియో కెమెరాలు, 8 వీఎంఎస్ బోర్డులు అమర్చారు. అలాగే సెన్సార్లతో కూడిన బెల్లెట్లను వాహనం తిరిగే మలుపుల్లో పదుల సంఖ్యలో ఏర్పాటు చేశారు. రూ.1.21 కోట్లతో హైదరాబాద్‌కు చెందిన నిపున్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ ట్రాక్ నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే ట్రయల్‌రన్ పూర్తి చేసిన రవాణా శాఖ అధికారులు 1వ తేదీ నుంచి అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఫిబ్రవరి 1వ తేది నుంచి నగరంలోని డీటీసీ కార్యాలయంలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్నాం. ఇప్పటికే ట్రయల్‌రన్ పూర్తయింది. డ్రైవింగ్ టెస్ట్‌కు వచ్చే వారంతా ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్‌లోనే వాహనాలను డ్రైవ్ చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే ప్రక్రియ మాత్రం గతంలోలాగే.

- జీ. చందర్, డీటీసీ





రూపుదిద్దుకున్న ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్, డిజిటల్ ట్రాక్ స్తంభాలు (ఇన్‌సెట్‌లో)

- అంతా ఆటోమేటిక్...

ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను ఆధునిక టెక్నాలజీతో నిర్మించారు. గతంలోలా డ్రైవింగ్ టెస్ట్‌కు వచ్చిన వారు అధికారుల పర్యవేక్షణలో వాహనాలు నడిపి లైసెన్సులు పొందేవారు. ఇప్పుడు అలా కుదరదు. డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చినవారు ముందుగా ట్రాక్ ఆవరణలో ఉన్న కియోస్క్ యంత్రంలో వేలిముద్ర వేయాలి. ఆ వెంటనే ఓ టోకెన్ వస్తుంది. ఆ టోకెన్ తీసుకొని ట్రాక్‌లోకి వెళ్లాలి. బైక్, ఆటో, కారు డ్రైవింగ్ టెస్ట్ కోసం వచ్చిన వారికి ఆయా వాహనాలకు సంబంధించిన రూట్లను సిబ్బంది చూపిస్తారు. ట్రాక్‌లోకి ప్రవేశించగానే అక్కడున్న సెన్సార్ వద్ద టోకెన్‌ను స్కాన్ చేయాలి. ట్రాక్‌పై ఉంచిన వీఎంఎస్ బోర్డుపై గ్రీన్ సిగ్నల్ వస్తుంది. దరఖాస్తు ప్రక్రియలో తప్పులు ఉంటే రెడ్ సిగ్నల్ వస్తుంది. గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాత లైసెన్స్ కోసం వచ్చిన అభ్యర్థి సూచిక బోర్డుల ఆధారంగా వాహనం నడపాలి. ట్రాక్‌పై ఏర్పాటు చేసిన సెన్సార్లు, బెల్లెట్లకు కాలు తగిలినా, కాలు కింద మోపినా వీఎంఎస్ బోర్డులో ఫెయిల్ అని వస్తుంది. ఈ ప్రక్రియను రవాణాశాఖ అధికారులతో పాటు ప్రైవేటు కంపెనీకి చెందిన ప్రతినిధులు పరిశీలిస్తుంటారు.

PUBLIC NOTICE

We, M/s BRDG Infra Pvt. Ltd., intend to purchase 0.975 acres in Doruvulapalem Gram Panchayat, Survey No. 645, LP M No. 348, Epuru Bit-IA Village, Muthukur Mandal, Sri Potti Sriramulu, Nellore, Andhra Pradesh from Mr. Konijeti Badri Narayana of Obgole, Andhra Pradesh. If anyone has any objections to this transaction, please report them within seven days from the date of this publication. Patiram (Director) M: 9313534002

Kondamareddy Venkataramana Reddy (Advocate)
Vikram Nagar, Nellore, Andhra Pradesh
M: 8897797979

सार्वजनिक सूचना

हम, एम/एस बीआरडीजी इन्फ्रा प्रा. लिमिटेड, ओबगोले, आंध्र प्रदेश के श्री कोनिजेटी बद्री नारायण से, आंध्र प्रदेश के श्री पोट्टी श्रीरामुलु, नेल्लोर, मुथुकुर मंडल, एपूरू बिट-आईए गांव, डोरुवुलपालम ग्राम पंचायत, सर्वेक्षण संख्या 645, एलपी एम संख्या 348 में 0.975 एकड़ भूमि खरीदने का इरादा रखते हैं। यदि किसी को इस लेन-देन पर कोई आपत्ति हो, तो कृपया इस प्रकाशन की तारीख से सात दिनों के भीतर अपनी आपत्ति दर्ज करें।

पतीराम (निदेशक) मोबाइल: 9313534002
कोंडामरेड्डी वेंकटारमण रेड्डी (वकील) विक्रम नगर, नेल्लोर, आंध्र प्रदेश मोबाइल: 8897797979

డిప్యూటీ మేయర్
ఎన్నికపై కసరత్తు

- 3వ తేదీన ఎన్నిక
- ముస్లింలకే కేటాయించాలన్న టీడీపీ అధిష్ఠానం
- పోటీకి మేమూ సిద్ధమంటున్న వైసీపీ

నెల్లూరు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నికకు ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ సిద్ధమవుతున్నాయి. మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో కార్పొరేషన్‌లో టీడీపీ సంఖ్యాబలం ఎక్కువగా ఉన్నా, వైసీపీకి గెలిచే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నా.. పోటీ మాత్రం అనివార్యం కానుంది. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా వైసీపీ పోటీ చేయాలని నిర్ణయించుకుంది. విశేషమేమంటే రెండు పార్టీలు ముస్లిం మైనారిటీ అభ్యర్థులనే రంగంలోకి దించనున్నాయి.

- వివరాలు 6లో

రిజిస్ట్రేషన్లకు సర్వర్ డౌన్!

- రూ.కోట్ల ఆదాయానికి గండి

నెల్లూరు (హరనాథపురం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ సర్వర్ గురువారం మొరాయించింది. దీంతో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు ఆటంకం ఏర్పడగా, ఆ శాఖ ఆదాయానికి గండి పడింది. సాధారణంగా రోజుకు రూ.కోటి నుంచి రూ.ఒకటిన్నర కోటి వరకు ఈ శాఖకు ఆదాయం వస్తుంది. అయితే, తరచూ సర్వర్ సమస్య తలెత్తడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆగి ఈసీలు, నకళ్లు రావడం లేదు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి భూముల విలువలు పెరుగుతాయని ప్రభుత్వం ప్రకటించడంతో రిజిస్ట్రేషన్ చేసుకునే వారి సంఖ్య సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు భారీగా పెరిగింది. గురువారం సర్వర్ పని చేయకపోవడంతో అంతా వెనుతిరిగారు. శుక్రవారమైనా సర్వర్ పని చేస్తుందా అనే ఆందోళన నెలకొంది. శనివారం నుంచి భూములు, స్థలాల మార్కెట్ విలువలు పెరగనుండటంతో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుంటే కొంతమేర రిజిస్ట్రేషన్ విలువల భారం తగ్గుతుందని జనం భావిస్తూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు చేరుకుంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సర్వర్ సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

- అల్లూరు : సర్వర్ మొరాయించడంతో అల్లూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో గురువారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యమైంది. తొలుత పీడీఈ సర్వర్ మొరాయించడంతో సమస్య తీవ్రతరమైంది. అదేవిధంగా కార్యాలయంలో పీడీఈ వెబ్‌సైట్ సక్రమంగా పనిచేయకపోవడంతో మధ్యాహ్నం వరకు ఎటువంటి రిజిస్ట్రేషన్లు జరగలేదు. దీంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన కక్షిదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.



అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

అంగన్వాడీల
మరో పోరుబాట

- సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం
- వచ్చే నెల 17 నుంచి ఆందోళనకు శ్రీకారం

నెల్లూరు (హరనాథపురం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు పౌష్టికాహారం అందించి, వారికి ఆటపాటలతో పాటు, విద్యాబుద్ధులు నేర్పించే అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఎదుగుబొదుగూ లేని వేతనాలతో జీవనం సాగిస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదంటూ వారు వాపోతున్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం రూ.4,200లుగా ఉన్న వారి వేతనాన్ని రూ.10,500లకు పెంచింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక వేతనాలు బాగా పెరుగుతాయని వారంతా ఆశించారు. కానీ రూ.వెయ్యి పెంచి చేతులు దులుపుకుంది. కనీస వేతనం అమలు చేస్తామని వైసీపీ ప్రకటించినా అమలు చేయలేదని వారు తిరగబడ్డారు. కానీ ఫలితం లేకుండా పోయింది.

- ఎస్మా ప్రయోగించినా..

తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలనే డిమాండ్‌తో 2023, డిసెంబరు 12 నుంచి 2024 జనవరి 23వ తేదీ వరకు వైసీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీలు పోరాటం చేశారు. వారి విన్నపాలు అప్పటి వైసీపీ పెద్దలకు చెవికెక్కలేదు. పైగా ఎస్మా ప్రయోగించి, విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించింది. అయినా వారు ఏమాత్రం జంకలేదు. 42 రోజులపాటు సుదీర్ఘంగా పోరాడినా డిమాండ్లను సాధించుకోలేకపోయారు. చట్ట ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసినా దాని అమలుకు బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదని వారు ఆరోపించారు. ఈ క్రమంలో మళ్లీ తమ డిమాండ్ల సాధన కోసం పోరాటానికి సిద్ధమవుతున్నారు.

డిమాండ్లు ఇవే...

- అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లకు కనీస వేతనం రూ.32 వేలు ఇవ్వాలి. హెల్పర్లకు రూ.26వేలు ఇవ్వాలి.
- ఐసీడీఎస్‌కు అవసరమైన నిధులు బడ్జెట్‌లో కేటాయించాలి.
- గుజరాత్ హైకోర్టు ఆదేశాల ప్రకారం అంగన్‌వాడీ వర్కర్లను మూడో తరగతి, హెల్పర్లను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి.
- పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి.
- వేతనాలు, అలవెన్సులు, అద్దెలు, మొబైల్ ఫోన్లు, రీచార్జుల బకాయిలన్నీ వెంటనే చెల్లించాలి.
- ఏ రూపంలోనూ ఐసీడీఎస్‌ను ప్రైవేటీకరించరాదు.
- సీఎస్ఆర్ పేరుతో ఐసీడీఎస్‌లో కార్పొరేట్లు ఉండరాదు. నగదు బదిలీ ఉండరాదు.

ఫిబ్రవరి 17, 18, 19 తేదీల్లో వారు తిరిగి ఆందోళనబాట పడుతున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో తమ డిమాండ్లన్నీ పరిష్కారమవుతాయనే ఆశతో వారున్నారు

కనీస వేతనం ఇవ్వాలి



ఏళ్ల తరబడి అంగన్‌వాడీలు చిన్నారులసేవలో ఉన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చాలీచాలనీ వేతనాలతో జీవనం గడపలేకపోతున్నాం. కనీసం వేతనం రూ.32 వేలు ఇవ్వాలి. గ్రాట్యూటీ చెల్లించాలి.

- ఏలూరు సుజాతమ్మ, జిల్లా అధ్యక్షురాలు అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



ఏళ్ల తరబడి అంగన్‌వాడీలుగా పని చేస్తున్నాం. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి. ఐసీడీఎస్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.

- రెహానాబేగం, కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్

జైలు సూపరింటెండెంట్‌గా
వెంకటేశ్వరరావు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నెల్లూరు సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ (ఎఫ్ఏసీ)గా వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడున్న రాజారావుపై పలు అవినీతి ఆరోపణలకు సంబంధించిన వాయిస్ రికార్డులు బయటకు వచ్చాయి. ఈ నేపథ్యంలో బుధవారం డీఐజీ డాక్టర్ వరప్రసాద్ మూలాపేటలో ఉన్న ఏపీ స్టార్స్‌లో రహస్యంగా విచారించారు. అవినీతికి సంబంధించిన ఆడియోలో ఉన్న వ్యక్తులను పిలిచి విచారించి, వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసుకున్నారు. ఈ క్రమంలో నెల్లూరు సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా ఉన్న రాజారావును ఏపీ స్టార్స్‌కు బదిలీ చేస్తూ గురువారం డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో జిల్లా సబ్ జైళ్ల అధికారిగా ఉన్న వెంకటేశ్వరరావును ఎఫ్ఏసీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఆంధ్రజ్యోతి



కార్ అండ్ బైక్ రేస్

జనవరి నెల కూపన్ నంబర్ - 3

పాఠకుని పూర్తి పేరు	:	....
డోర్ నెంబరు	:	....
వీధి పేరు	:	....
గ్రామం / పట్టణం	:	....
మండలం	:	....
జిల్లా	:	....
పోస్టల్ పిన్‌కోడ్	:	....
ఫోన్ నంబర్	:	....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది జనవరి నెల మూడవ కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి రెండు నెలలు అయిన తర్వాత మొత్తం 6 కూపన్లను రెండు సెట్లుగా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.

నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.

* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.



కూపన్లు పంపవలసిన చిరునామా

ఆంధ్రజ్యోతి బిల్డింగ్, నెం.91, ఉడ్ కాంప్లెక్స్,
అయ్యప్పగుడి సెంటర్, వేదాయపాళెం, నెల్లూరు-524004.
సెల్: 99854 11421, 99854 11424

అలరించిన సూర్యాస్తమయం



పెన్నానదిలో గురువారం సాయంత్రం సూర్యాస్తమయం ప్రకృతి ఆరాధికులను అలరించింది. పడుగుపాడు- నెల్లూరు మార్గంలో సూర్యాస్తమయం దృశ్యాలను పలువురు తమ సెల్‌ఫోను, కెమెరాల్లో బంధించారు.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)



మడుగును తలపిస్తున్న రోడ్డు



పైపులో నుంచి వస్తున్న నీరు



పిల్లలకు మాత్రం భలే సరదా!

నీర(క్ష)ం!

● రోడ్డుపాలవుతున్న తాగునీరు

నగరంలోని భగత్‌సింగ్ కాలనీ టిడ్కో అపార్టమెంట్ల ఆవరణలో దుస్థితి ఇది. అపార్ట్‌మెంట్లపై ట్యాంక్‌ల నుంచి నీటిని వది లేయడంతో ఇదిగో ఇలా రోడ్డంతా మడుగును తలపించింది. ట్యాంకు నిండిన వెంటనే మోటరు ఆఫ్ చేయకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడుతోంది. స్థానికులే కాదు.. కార్పొరేషన్ సిబ్బంది కూడా పట్టించుకోకపోవడంతో నిత్యం నీరంతా ఇలా వృథా అవుతోంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు

సింహపురి సీమ మరో చరిత్రకు నిదర్శం కాబోతున్నది. ఎప్పుడో 45 ఏళ్ల క్రితం సీపీఎం రాష్ట్ర మహాసభలు ఈ జిల్లాలో జరిగాయి. తాజాగా ఫిబ్రవరి ఒకటి నుంచి మూడో తేదీ వరకు ఆ పార్టీ 27వ రాష్ట్ర మహాసభలు ఇక్కడ జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు ఉద్యమాల గురించి రేఖామాత్రంగా చెప్పుకోవడం ముదావహం. మహాసభల ఏర్పాట్లు పూర్తయ్యాయి. జనసమీకరణలో భాగంగా కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. సర్వశక్తులు ఒడ్డి పార్టీ శ్రేణులు సభల విజయవంతానికి కృషి చేస్తున్నారు.



నెల్లూరు : కనకమహల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మహాసభల స్వాగత ద్వారం

● రేపటినుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు
● ఎన్నో ఉద్యమాలకు పుట్టినిల్లు సింహపురి
● నాటి పుచ్చలపల్లి నుంచి నిన్నటి జక్కా వెంకయ్య వరకు..
● ఆస్తులు సైతం వదులుకున్న త్యాగధనులు

కమ్యూనిస్టుల పురిటిగడ్డపై

మహా సంబరం!

నెల్లూరు (వైద్యం) జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు ఉద్యమాల్లో జిల్లాకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఉద్యమ నాయకుడిగా దక్షిణ భారతంలో అనేక ప్రజా పోరాటాల ద్వారా పుచ్చలపల్లి సుందరయ్య తనకంటూ ఓ గుర్తింపు పొందారు. తొలుత కోవూరు నియోజకవర్గ పరిధిలోని అలగాడుపాడులో ఆయన 1934లోనే రైతు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత కమ్యూనిస్టు నేతగా ఎన్నో పోరాటాలు చేశా రు. ఉభయ కమ్యూనిస్టుల రాష్ట్ర కార్యదర్శిగా కూడా సుందరయ్య పనిచేశారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం నుంచి 1956, 1967 సంవత్సరాల్లో ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత రాజ్యసభ సభ్యుడిగా కూడా పనిచేసి ఉత్తమ ఎంపీగా వినతి కెక్కారు. ఎంపీగా అనేక సంస్కరణలు తీసుకు వచ్చారు. తన యావదాస్తిని పేదలకు పంచిపెట్టారు.

● నాడు ఎంతో ప్రాభవం

అప్పట్లో జిల్లాలో కమ్యూనిస్టుల ప్రాభవం ఎంతో ఉండేది. 1952లో కోవూరు నుంచి బస్వారెడ్డి శంకరయ్య, నెల్లూరు జనరల్ నుంచి ఖండవల్లి కృష్ణారావు, ఆత్మకూరు నుంచి జీసీ కొండయ్య, నెల్లూరు రిజర్వుడు నియోజకవర్గం నుంచి స్వర్ణావేమయ్య కమ్యూనిస్టు ఎమ్మెల్యేలుగా గెలిచి ప్రజాదరణ పొందారు. అలాగే కేంద్ర కమిటీ సభ్యుడిగా, జిల్లా కార్యదర్శిగా పనిచేసిన

చరిత్రలో రామచంద్రారెడ్డి ఆసుపత్రి

డాక్టర్ పుచ్చలపల్లి సుందరయ్య సోదరుడు డాక్టర్ రామచంద్రారెడ్డి 1950లో నగరంలోని శంకర అగ్రహారంలో చిన్న ఆసుపత్రిని ఏర్పాటు చేసి, ఆ తర్వాత దాన్ని విస్తరించారు. అప్పట్లో జిల్లా నుంచే కాకుండా చిత్తూరు, ప్రకాశం, కడప జిల్లాల నుంచి కూడా రోగులు ఇక్కడకు వచ్చి వైద్య చికిత్సలు పొందేవారు. కమ్యూనిస్టుల ఆసుపత్రిగా దీనికి పేరు ఉన్నా పార్టీలకు అతీతంగా పలువురు ఇక్కడ వైద్య చికిత్సలు అందుకున్నారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రి ఎంతోమంది పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంది. 1956లో పుచ్చలపల్లి సుందరయ్య, జక్కా వెంకయ్య ఆశయాలకు ఆకర్షితులైన డాక్టర్ జెట్టి శేషారెడ్డి తన వైద్య వృత్తిని ఆసుపత్రిలోనే కొనసాగిస్తూ కమ్యూనిస్టు ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. డాక్టర్ రామచంద్రారెడ్డి మరణానంతరం శేషారెడ్డి ఆసుపత్రి బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు ఆయన ఎంతో కృషి చేశారు. అలాగే నెల్లూరులో రెడ్‌క్రాస్‌లో బ్లడ్‌బ్యాంకు ఏర్పాటుకు కూడా అవిరళ కృషి చేశారు. 2008 జూన్‌లో ఆయన మృతిచెందారు. ఆయన జ్ఞాపకార్థం సీపీఎం నేతలు డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రాన్ని నగరంలో ఏర్పాటు చేశారు. పేదలకు ఎన్నో వైద్యసేవలు అందిస్తున్న రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల(పీపీసీ) జిల్లా చరిత్రలో శాశ్వత స్థానం సంపాదించుకుంది.



జక్కా వెంకయ్య కూడా ఎన్నో ప్రజా ఉద్యమాలు చేపట్టారు, 1985, 1995లలో అల్లూరు నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి జిల్లాలో పలు సంస్కరణలు తీసుకు వచ్చారు. రైతు, ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసి విజయం సాధించారు. ఈయన కూడా తన ఆస్తులను ప్రజలకు పంచిపెట్టారు. మంచి కమ్యూనిస్టు యోధుడిగా జిల్లాలో గుర్తింపు పొందారు.



నెల్లూరులోని సీపీఎం జిల్లా కార్యాలయం ఇదే!

సారా, అక్షరాస్యత ఉద్యమంలోనూ..

జిల్లాలో సారా, అక్షరాస్యత ఉద్యమాల్లో కమ్యూనిస్టులు కీలక భూమిక పోషించారు. 1992 డిసెంబరు ఒకటి నుంచి 17 వరకు ఆయా ఉద్యమాలపై పోరాటం చేసేందుకు నాలుగు బృందాలు జిల్లాలో పర్యటించాయి. కొండాపురం మండలం దూబగుంటలో దూబగుంట రోశమ్మ తన కుమారులు సారాకు బానిసలు అవడంతో సారాకు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టారు. దీంతో సారా ఉద్యమం ఊపందుకుంది. అప్పట్లో వీఆర్‌సీ క్రీడా మైదానంలో జరిగిన సమావేశంలో 50వేలమంది తరలివచ్చారు. ఇందులో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏసీ స్టేడియంలో జరిగిన సారా వేలంపాటలను అడ్డుకునేందుకు 1993 సెప్టెంబరులో పెద్దసంఖ్యలో ఉద్యమకారులు తరలివచ్చి వేలంపాటలను అడ్డుకున్నారు. అప్పట్లో తిరుపతి షూటింగ్‌లో ఉన్న ఎన్‌టీ రామారావు నెల్లూరు ఏసీ స్టేడియం చేరుకుని ఉద్యమకారులను కలిశారు. తనను గెలిపిస్తే సారా నిషేధిస్తానన్నారు. ఉద్యమకారుల దెబ్బకు దిగి వచ్చిన అప్పటి సీఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి సారా వేలంపాటను రద్దు చేశారు. ఇందులో కమ్యూనిస్టులు కీలకపాత్ర పోషించారు. ఇలాంటి కమ్యూనిస్టు ఉద్యమాలకు నెల్లూరు జిల్లా కేంద్ర బిందువుగా మారింది. నాటి ఉద్యమకారులను ఆదర్శంగా తీసుకుని నేడు నాయకులు, కార్యకర్తలు నడవాలని సీపీఎం అగ్రనేతలు చెబుతున్నారు.

ప్రయోగ పరీక్షల్లో ప్రణాళికతోనే విజయం

● ఇంటర్‌లో ఉత్తమ మార్కులకు అవకాశం
● విషయ నిపుణుల సూచనలు ఎంతో ముఖ్యం

నెల్లూరు (విద్య), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ బైపీసీ, ఎంపీసీ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలే కాదు ప్రయోగ పరీక్షలూ ఎంతో ముఖ్యమైనవి. ఇప్పటికే జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కుల కోసం విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. అంతకంటే ముందుగా జరిగే ప్రయోగ పరీక్షలకూ ఇప్పటినుంచే సన్నద్ధం కావాల్సి ఉంది. విద్యార్థుల్లో సబ్జెక్ట్‌లపై ఆసక్తి, విశ్లేషణ సామర్థ్యాలు, నైపుణ్యం వంటి వాటిపై ప్రయోగ పరీక్షలు అవగాహన పెంచుతాయి. ప్రయోగాత్మక అంశాలు, సూత్రాలు నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు ఆవిష్కరణల రూపకల్పనకు దోహదం చేస్తాయి. భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి కోర్సుల్లో ప్రవేశాలకు అవసరమైన నైపుణ్యాలను కల్పిస్తాయి. వచ్చే నెల 10 నుంచి 20వతేదీ వరకు జిల్లాలో 121 కేంద్రాల్లో సైన్స్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు 23,507 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షలకు సమయం సమీపిస్తుండటంతో విద్యార్థులు ఏ ఏ అంశాలపై దృష్టి సారించాలన్న విషయాలపై జిల్లాలోని సబ్జెక్ట్ నిపుణులు తెలియచేశారు.

సులభంగా జంతుశాస్త్రం



జంతుశాస్త్ర ప్రయోగ పరీక్షలు మిగిలిన సబ్జెక్టలతో పోలిస్తే సులభంగా ఉంటాయి. 68 ప్రయోగ ప్రశ్నలను 3 విభాగాలుగా విభజించారు. రికార్డును 4వ విభాగంగా పెట్టారు. మొదటి విభాగంలోని నమూనాలు, చార్టులు, ప్రొజెక్టన్‌కు సంబంధించి 11 ప్రశ్నల్లో ఒక దానికి సమాధానం రాసేలా సన్నద్ధమ వ్వాలి. విద్యార్థులు నమూనా, చార్టు, ప్రొజెక్టన్‌ను గుర్తించి చక్కటి పటం గీసి కనిష్ఠంగా నాలుగు విభాగాలుగా గుర్తిస్తే 6 మార్కులు పొందవచ్చు. రెండో విభాగంలో శరీర ధర్మశాస్త్ర ప్రయోగాలపై ఇచ్చే 5 ప్రశ్నలలో ఒకదానికి సమాధానం రాయాలి. దీనిలో సూత్రం, ప్రయోగ విధాన ఫలితం రాస్తే 5 మార్కులు వస్తాయి. మూడో విభాగంలో 7 సహ విభాగాలుగా విభజించారు. అందులో స్లైడ్స్, స్పెసిమన్‌లు, క్షీరద కీళ్లు ఉంటాయి వీటికి 14 మార్కులు కేటాయించారు. దీనిలో గుర్తింపు లక్షణాలపై విద్యార్థులు ఖచ్చితంగా దృష్టి సారించాలి. రికార్డుకు సంబంధించిన విద్యార్థులు చక్కటి పటాలు వేస్తూ చేతిరాతను అందంగా రాసేలా సన్నద్ధమవ్వాలి. వీటికి 5 మార్కులు ఉంటాయి. దీనిపై పూర్తిగా శ్రద్ధ వహిస్తే పూర్తి మార్కులు సొంతం చేసుకోవచ్చు.

- డాక్టర్ ఎం.రమణారెడ్డి, జంతుశాస్త్ర అధ్యాపకుడు, కేపీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల

విభిన్నం.. భౌతికశాస్త్రం



భౌతికశాస్త్ర ప్రయోగ పరీక్ష మిగిలిన సబ్జెక్ట్‌లతో పోలిస్తే కాస్త విభిన్నం. విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రయోగాలను సాధన చేయడం ద్వారా 30 మార్కులను సాధించవచ్చు. ప్రతి విద్యార్థి వార్షిక ప్రయోగ పరీక్షల్లో లాటరీ పద్దతి లో ఒక ప్రశ్నను ఎంచుకుని జవాబు రాయాల్సి ఉంటుంది. సూత్రం, ప్రయో గ విధానానికి 5, పట్టిక రూపం, గ్రాఫ్-పరిశీలనలకు 8, జాగ్రత్తలకు 2, గణన, ఫలితం 6, మౌఖిక పరీక్ష 5, రికార్డుకు 5 మార్కులు ఉంటాయి. నేర్చుకున్న ప్రయోగాన్ని సరైన విధా నంలో ప్రదర్శన చేయడంపై ధ్యాస ఉంచాలి. అప్పుడే మంచి మార్కులు సాధించవచ్చు.

- ఎస్‌కె.గౌస్ బాషా, భౌతికశాస్త్ర అధ్యాపకుడు, టీఎన్‌సీ కోవూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల



రసాయనశాస్త్రంలో అవగాహన ముఖ్యం



రసాయనశాస్త్రం ప్రయోగ పరీక్షల్లో 30 మార్కులు సాధించాలంటే విద్యార్థులు ప్రయోగాలపై అవగాహన కలిగి ఉండాలి. సూత్రం, ప్రతి ప్రయోగ పరీక్ష వివరాలు, సమాధానాలు చక్కగా రాసే విధానాలపై ధ్యాస ఉంచాలి. లవణ జల విశ్లేషణలో 12 లవణాల్లో ఒక లవణాన్ని లాటరీ ద్వారా విద్యార్థి ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. దీనిలో ఆనయాన్, కాటయాన్ గుర్తించి వాటి ఆధారంగా లవణం పేరు రాయాలి. ఇందుకోసం వాటిని ఎక్కువగా సాధన చేస్తూ ఉండాలి. ఘనపరిమాణాత్మక విశ్లేషణలో తెలిసిన ఒక ద్రావణం గాడతను లెక్కించాలి. వీటిలో ఆమ్లక్షార విశ్లేషణలకు సంబంధించి ప్రశ్నలు ఉంటాయి. గణన, విశ్లేషణ సామర్థ్యాలను నేర్చుకుంటే 8 మార్కులు సాధించవచ్చు. అలాగే నాలుగు ఉప విభాగాలపై ఏదైనా ఒకదాని నుంచి మాత్రమే సమాధానం రాస్తే 6 మార్కులు పొందవచ్చు. అలాగే సాల్ట్ అనాలసిస్ 10 మార్కులు, రికార్డ్‌కు 2, ప్రాజెక్ట్ వర్క్‌కు 2, వివాకు 2 మార్కులు ఉంటాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు వాటిపై పూర్తి అవగాహన పెంచుకుని పరీక్షలకు సన్నద్ధమవ్వాలి.

- పాలకొలను లక్ష్మీరెడ్డి, రసాయన శాస్త్రం అధ్యాపకుడు, ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఆసక్తిగా వృక్షశాస్త్రం



విద్యార్థులు తమ నిత్య జీవితంలో చూసే మొక్కల లక్షణాలు, నిర్మాణం, పుష్ప విన్యాసం, శాఖీయోత్పత్తి తదితర అంశాలను ఆసక్తిగా అధ్యయనం చేయాలి. వృక్ష వర్గీకరణ శాస్త్రంలో గుర్తింపు, శాఖీయ లక్షణాలు, పుష్ప విన్యాసంతో కూడిన కొమ్మ, పుష్పం నిలువు కోత చిత్రాలకు సంబంధించిన పటాలు, సమీకరణంపై విద్యార్థులు సృజన పెంచుకోవాలి. అంతర్నిర్మాణ శాస్త్ర విభాగంలో సెక్షన్ కటింగ్, విభాగ విచ్ఛేదనం చేసి గుర్తింపు, స్లైడ్ ప్రిపరేషన్ భాగాలతో కూడినపటం వేసేలా నైపుణ్యతను ప్రదర్శించేలా సన్నద్ధమవ్వాలి. లైవ్ ప్రయోగాల విభాగంలో లాటరీ పద్ధతిన ఎంపిక చేసే ప్రశ్నకు సమాధానం రాయాల్సి ఉంటుంది. దీనిలో ప్రయోగం చేయడం, ఉద్దేశం, సూత్రం, పరిశీలన, అనుమతి గురించి రాసేలా విద్యార్థులు పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి. నాలుగో విభాగంలోని 5 ప్రశ్నలకు ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ప్రతి బిట్‌లో ఒక ప్రశ్నకు సమాధానం రాయాలి. గుర్తింపు కారణాలు రాసేలా సన్నద్ధమవ్వాలి.

- ఎన్.మృదుల, వృక్షశాస్త్రం అధ్యాపకురాలు, బుచ్చి ప్రభుత్వ జూనియర్ కళాశాల

వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణకు నిధులు మంజూరు చేయండి : అజీజ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం రూ.50 కోట్లు, మసీదుల మర మ్మతులకు రూ.10 కోట్లు మంజూరు చేయాలని సీఎం చంద్ర బాబును వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ కోరారు. అమరావతి లోని రాష్ట్ర సచివాలయంలో గురువారం ఆయన ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ వక్ఫ్‌బోర్డ్ నుంచి ఏపీ వక్ఫ్‌బోర్డ్‌కు రావాల్సిన రూ.50 కోట్లు పెండింగ్ బకా యిలను ఇప్పించాలని కోరారు. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్ర రాష్ట్ర వక్ఫ్‌బోర్డుకు చెందిన అన్ని రికార్డులు, పత్రాలు తెలంగాణ నుంచి బదిలీ చేయలేదని, ఆస్తులను అప్పగించలేదన్నారు. ఆదాయం లేని 1500 మసీదుల పెండింగ్ దరఖాస్తులను, మసీ దులు, కాంపౌండ్ గోడలు, గ్రేవ్ యార్డ్‌లు, ఈద్గాలు, అషూర్ ఖా నాలు, దర్గాలు నిర్మాణాలు, మరమ్మతుల కోసం నిధులు కేటా యించాలని ఆయన సీఎంను కోరారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

రీసర్వే భూసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

● ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం) జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : భూముల రీసర్వే రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూసమస్యలను పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో తహసీల్దారు, సర్వేయర్లతో జేసీ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వే గ్రామసభల్లో వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పరిష్కారం చూపాలన్నారు. ఎఫ్ లైన్ సర్వే, పట్టా సబ్ డివిజన్ దరఖాస్తులు పెండింగ్ ఉండకూదన్నారు. ప్రతిరోజూ రెవెన్యూ డివిజనల్ అధికారులు మండల స్థాయిలో పెండింగ్ అంశాలపై సమీక్ష చేయాలన్నారు. అర్జీల పరిష్కారంలో సాంకేతికంగా ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఫిబ్రవరి 15లోగా నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్‌ను భూసేకరణ, నష్టపరిహారం వివరాలు కలెక్టరేట్‌కు అందించాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, జిల్లా భూసర్వే రికార్డుల ఏడీ వైనాగేశ్వర్, కావలి ఆర్డీవో వంశీకృష్ణ, ఆత్మకూరు ఆర్డీవో పావని, తహసీల్దారులు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ ఎన్నికపై కసరత్తు



నెల్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే క్రమంలో డిప్యూటీ మేయర్ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఖాళీ ఏర్పడిన స్థానాన్ని భర్తీ చేయడానికి వచ్చే నెల 3వ తేదీన ఎన్నిక జరగనుంది. 54 డివిజన్ల సంఖ్యాబలం కలిగిన కార్పొరేషన్‌లో గతంలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో మొత్తం స్థానాలను వైసీపీ గెలుచుకుంది. అయితే రాష్ట్రంలో అధికారం మార్పిడితో వైసీపీకి చెందిన కార్పొరేటర్లు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరిపోయారు. ప్రస్తుతం టీడీపీకి 41 మంది కార్పొరేటర్లు ఉన్నారు. సిటీ నియోజకవర్గ పరిధిలో 20, రూరల్ నియోజకవర్గ పరిధిలో 21 మంది కార్పొరేటర్లు టీడీపీ పక్షం ఉన్నారు. 41 మంది కార్పొరేటర్లకాక అదనంగా ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఓటుతో కలిపి 43 ఓట్లతో టీడీపీ బలంగా ఉంది. ఇక వైసీపీ విషయానికి వస్తే కేవలం 12 మంది మాత్రమే మిగిలారు. సిటీ నియోజకవర్గ పరిధిలో ఏడుగురు, రూరల్ నియోజకవర్గ పరిధిలో ఐదుగురు ఉన్నారు. ఖలీల్ రాజీనామాతో ఒక స్థానం ఖాళీగా ఉండగా, వైసీపీకి రాజీనామా చేసిన క్రమంలో మేయర్ స్రవంతి తటస్థంగా ఉన్నారు. ఈ క్రమంలో డిప్యూటీ మేయర్ ఎన్నిక టీడీపీకి అనుకూలంగా ఏకపక్షం అయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నామ మాత్రపు బలం ఉన్న కారణంగా వైసీపీ పోటీ చేయబోదనే అందరూ భావించారు. అయితే గురువారం రాత్రి వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైసీపీ కూడా పోటీ చేయాలని నిర్ణయించుకోవడం కొసమెరుపు. కాకాణి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, వైసీపీకి చెందిన పది మంది కార్పొరేటర్లు ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో సమావేశం అయ్యారు. డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో పోటీ చేయాలా, తప్పుకోవాలా అనే అంశంపై చర్చించుకున్నారు. ఓడినా, గెలిచినా పోటీ చేయడమే మంచిదనే నిర్ణయానికి వచ్చారు.

● మైనారిటీలకే కేటాయించాలన్న టీడీపీ

డిప్యూటీ మేయర్ అభ్యర్థి విషయంలో తెలుగుదేశం అధిష్ఠానం జిల్లా పార్టీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. గతంలో డిప్యూటీ మేయర్‌గా మైనారిటీ అభ్యర్థి ఉన్న కారణంగా అదే వర్గానికి చెందిన వారికే అవకాశం ఇవ్వాలని టీడీపీ అధిష్ఠానం ఆదేశించింది. నగరంలో ముస్లిం మైనారిటీలు పెద్ద సంఖ్యలో ఉండటం, గతంలో తమ వర్గానికి చెందిన వ్యక్తి ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాన్ని తమ వర్గానికే కేటాయించాలని మైనారిటీ నాయకులు టీడీపీ అధినాయకత్వాన్ని కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో 48వ డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ తహసిన్ పేరు ప్రచారంలోకి వచ్చింది. మరోవైపు వైసీపీ కూడా మైనారిటీ అభ్యర్థినే రంగంలోకి దించాలని నిర్ణయించుకున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రకటించారు.

న్యూస్ బాక్స్

'అదానీ' పేరుతో విద్యుత్ మీటర్ల తనిఖీ

● భయాందోళనలో కావలి వాసులు

కావలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తాము అదానీ కంపెనీ సిబ్బంది అని మీ విద్యుత్ మీటర్లు తనిఖీ చేయాలని కొందరు యువకులు పట్టణంలోని ఇళ్లలోకి వస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అసలే గుర్తు తెలియని వ్యక్తులను నమ్మలేని ఈ రోజుల్లో ఎలాంటి గుర్తింపు కార్డులు లేకుండా ఇలా రావడం ఏమిటని స్థానికులు వాపోతున్నారు. అందులో భాగంగా పట్టణంలోని 28వ వార్డులో ముగ్గురు యువకులు కొన్ని ఇళ్లకు వెళ్లి మీటర్లు తనిఖీలు చేస్తుండగా ప్రజలు మీరు ఎవరని ప్రశ్నించి.. గుర్తింపు కార్డులు చూపించాలని అడగడంతో అక్కడనుంచి జారుకున్నారు. ఇళ్లలో పురుషులు లేకుండా ఉన్న సమయంలో ఆ యువకులు విద్యుత్ మీటర్ల తనిఖీల పేరుతో వచ్చి మహిళల మెడల్లోని బంగారు గొలుసులు లాక్కొని వెళ్లినా.. ఇంకేదైనా తీసుకెళ్లినా పరిస్థితి ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు.

● గుర్తింపు కార్డులు లేనిదే ఎవరినీ అనుమతించ వద్దు

- వసంతరావు, విద్యుత్ ఏఈ, కావలి

విద్యుత్ మీటర్లు తనిఖీ పేరుతో ఎవరు వచ్చినా సరైన ఆధారాలు చూపించకపోతే వారిని అనుమతించ వద్దు. తనిఖీలకు వెళ్లే వారు తగిన గుర్తింపు కార్డులతోనే వెళ్లాలని మా వద్దకు వచ్చిన కొంతమంది సిబ్బందికి ఈ విషయాన్ని సూచించాం.



పంటలను పరిశీలిస్తున్న డీఏవో సత్యవాణి

మిత్ర, శత్రు పురుగులను గుర్తించకుంటే నష్టమే!

నెల్లూరురూరల్, జనవరి 30, (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగవుతున్న వరిపైరులో మిత్ర, శత్రు పురుగులను గుర్తించకుంటే నష్టమేనని జిల్లా వ్యవసాయ అధికారిణి పీ సత్యవాణి తెలిపారు. మండలంలోని ఆమంచర్లలో రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలిం చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు తీసుకుని పైరులో సస్యరక్షణ పనులు చేపట్టాలన్నారు. ఇందుకోసమే పొలంపిలుస్తోంది నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోతాదుకు మించి రసాయనక ఎరువులు వాడటం వల్ల భూమిలో సారం కోల్పోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు ఎన్ శ్రీనివాసులు, నర్సోజీ, ఏవో ఎస్వీ నాగమోహన్ పాల్గొన్నారు.

మద్యం షాపుల కోసం పోటీ పడొద్దు

● గౌడ ఐక్యవేదిక రాష్ట్ర నేత బుర్రా వెంకటేశ్వర్లు గౌడ్

నెల్లూరు (హరనాధపురం) జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 18 మద్యం దుకాణాలను గౌడ కులస్థులకు కేటాయించారని, వాటి కోసం పోటీ పడకుండా ఐక్యంగా సాధించుకోవాలని గౌడ్ ఐక్యవేదిక సీనియర్ నేత బుర్రా వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. నెల్లూరు నగరంలోని గౌడ సంఘం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరు లతో మాట్లాడారు. షాపులకు దరఖాస్తు చేసుకున్న గౌడ కులస్థులను కొంత మంది రాజకీయ నేతలు బెదిరిస్తున్నారని, ఇలాంటి ఘటనలు లేకుండా చూడాలన్నారు. గౌడ సంఘం రాష్ట్ర నేత అన్నం దయాకర్‌గౌడ్ మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో గౌడ కులస్థులను ఎమ్మెల్యేలు భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇలాంటి వాటికి భయపడ వద్దన్నారు. మరో నేత వెంపులూరు భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ గమళ్ల, గౌడ, గౌడు, ఈడిగ అంతా కూడా ఒకే కులస్థులు అయినా నోటిఫికేషన్‌లో రకరకాలుగా విభజించడం సరికాదన్నారు. సమావేశంలో సంఘం నేతలు ముత్యంగౌడ్, చిలక శ్రీనివాసులు, మారుబోయిన మధు, తాతా హేమంత్, తుళ్లూరు మల్లికార్జున్, తిరకాల శివ, పుష్పాల శీనయ్య, పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	125
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	248
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7856
వెండి కిలో ధర	రూ. 93,000
వెండి ఒక గ్రాము	రూ.96.00

పరీక్షల్లో ఫెయిల్ అయ్యామనో.. ప్రేమ విఫలం అయ్యిందనో.. అప్పుల బాధ ఎక్కువైందనో.. భార్యాభర్తల నడుమ గొడవలతోనో.. తల్లి తిట్టిందని.. తండ్రి కొట్టారనో ఇలా.. ఇబ్బందులు ఏవైనా ఆత్మహత్యలకు పాల్పడేవారి సంఖ్య ఎక్కువవుతోంది. మీరే లోకంగా.. మిమ్మల్నే నమ్ముకుని బతుకుతున్న వారి మనోవేదన గురించి ఒక్కక్షణం ఆలోచించండి. సమస్య ఎదురైనప్పుడు దాని పరిష్కారమార్గం వెతుక్కోవాలేకానీ బలవంతంగా ప్రాణం తీసుకోకూడదు. క్షణికావేశంలలో ఎంతో మంది బలవన్మరణాలకు పాల్పడుతూ కన్నవారికి తీరని శోకం మిగుల్చుతున్నారు. గడిచిన మూడేళ్లలో జిల్లావ్యాప్తంగా 1,184 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. గత ఏడాదే 382 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)



గడిచిన మూడేళ్లలో..

సంవత్సరం	పురుషులు	మహిళలు	మొత్తం
2022	274	96	370
2023	333	99	432
2024	292	90	382
	899	285	1184

సమస్యకు చావే పరిష్కారమా!?

● కుటుంబ సభ్యుల గురించి ఆలోచించండి!

● మూడేళ్లలో 1,184 మంది బలవన్మరణం

● కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలంటున్న నిపుణులు

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉన్న సమయంలో బాధలను మరొకరు పంచుకోవడంతో సమస్యకు పరిష్కారం దొరక్కపోయినా జీవితంపై ఆశలు కలిగి ఆత్మహత్య చేసుకోవాలన్న నిర్ణయాన్ని విరమించునేవారు. భార్య, భర్త, పిల్లలు మాత్రమే ఉన్న ప్రస్తుత సమాజంలోని చిన్న కుటుంబాల్లో కలహాలు తలెత్తినప్పుడు మరొకరితో వారి బాధలు చెప్పుకోలేక వారిలోనే కుంగిపోతూ ఆత్మహత్య వైపు అడుగులు వేస్తున్నారు. భార్యాభర్తలు, పిల్లలు రోజులో కనీసం ఒక్కపూట అయినా ఒకే దగ్గర కూర్చొని అరగంట మాట్లాడుకోరు. అదేమిటంటే సమయం లేదు.. బిజీ అంటుంటారు. పనిలేకపోయినా సెల్‌ఫోన్‌ను మాత్రం 24 గంటలు వినియోగిస్తూనే ఉంటున్నారు.

ఇటీవల జరిగిన ఘటనలు..

● నగరంలోని ఆచారివీధిలో సురేష్, దుర్గా (32) దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ నెల 9వ తేదీ దుర్గా ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం నగరంలోని రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనారోగ్యంతోనే ఆమె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి భర్త పోలీసులకు తెలిపారు.

● కోటమిట్ట ఎర్రదర్గా వద్ద షేక్ షమీమ్, నజీర్ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి కుమా రుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె రుబీనాకు మూడేళ్ల కిందట అదే ప్రాంతంలో ఉంటున్న అంజాద్‌తో వివాహం చేశారు. భార్య భర్తలు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఏం కష్టం వచ్చిందో తెలియదు కానీ రుబీనా ఈ నెల 10వ తేదీ ఇంట్లో చీరతో ఉరేసుకుంది.

● నీలగిరి సంఘంలో రామ్మోహన్ (50)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గతంలో ఆయన ఐటీసీ కంపెనీలో పనిచేశారు. అనారోగ్యంతో ఇంటివద్దనే ఉంటూ తండ్రి పెన్షన్‌తో జీవిస్తున్నారు. మద్యానికి బానిసైన ఆయన కుటుంబసభ్యులు మద్యం తాగొద్దని చెప్పినా మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో మద్యం తాగొద్దని భార్య రామ్మోహన్‌కు గట్టిగా వారించడంతో మనస్థాపానికి గురై ఈ నెల 12న ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు.

● ఎన్‌టీఆర్ నగర్ యాదవ్‌వీధిలో పాల వ్యాపారి మల్లయ్య వద్ద కొంతకాలంగా బిహార్‌లోని ముజాపూర్‌కు చెందిన సంజయ్‌యాదవ్ పని చేస్తున్నాడు. సంజయ్ యాదవ్ బావమరిది రాకేష్‌కుమార్ యాదవ్(21) గతేడాది డిసెంబర్ 28న నెల్లూరుకు వచ్చి, ఇక్కడే ఉంటున్నారు. రాకేష్‌కుమార్ యాదవ్ స్వగ్రామంలో ఓ యువతిని ప్రేమించాడు. కొంతకాలం కిందట వారి మధ్య మనస్పర్థలు రావడంతో యువతి అతన్ని దూరం పెట్టింది. తీవ్ర మనోవేదనకు గురై ఈ నెల 13న తాను ఉంటున్న గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడు.

● బుచ్చిరెడ్డిపాళెం శాంతినగర్‌లోని ఓ లేఔట్‌లో ఉంటున్న ఎస్‌కే ముజాహీద్ (20) తల్లి మందలించిందనే కోపంతో 29వ తేదీన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు.

● ఇందుకూరుపేట మండలం జగదేవిపేటకు చెందిన ఆనంతోచి వేణుగోపాలాచారి, లావణ్యల కుమార్తె దుర (14) నే బాలిక 28వ తేదీన ఇంట్లోని బాత్రూంలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ బాలిక మృతికి గల కారణాలు ఇంకా వెలుగులోకి రాలేదు.

● ఆ కుంటుంబాల వేదనలు వర్ణనాతీతం

ఆత్మహత్య చేసుకుంటే సమస్యలు పరిష్కారం కాకపోగా మీ కుటుంబ సభ్యులపై మరింత భారం పడు తుంది. మరణించిన వారు సమస్య నుంచి తప్పించుకుంటారే తప్ప బతికున్న కుటుంబసభ్యుల పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పడం వర్ణణా తీతం. రాజ్యాంగం జీవించే హక్కు కల్పించింది. దీన్ని ఉల్లంఘిస్తూ ఆత్మహత్యకు యత్నించిన వారు సెక్షన్ 309ప్రకారం శిక్షార్హులు. ఈ నేరానికి పాల్పడిన వారికి ఏడాది జైలు.. లేదా జరిమానా విధించవచ్చు.

ఇలా ఎదుర్కోవచ్చు..!



● ధైర్యం, ఆత్మవిశ్వాసం, మంచి ఆలోచనలతో భవిష్యత్‌ను చక్కగా ఊహించుకోవాలి.
● ఆత్మహత్య భావనలో ఉన్న వారిని ఒంటరిగా ఉంచకూడదు. వీలైనంత వరకు ఇంట్లో వారందరి మధ్య ఉంచుతూ అందరూ కలిసి ధైర్యం నింపాలి.
● సాధారణంగా ఆత్మహత్య భావన ఉన్నవారు చావు గురించి మాట్లాడటం, డైరీ, ఇతర పుస్తకాల్లో ఎలా చావాలో వంటి అంశాలను రాస్తుంటారు. వాటిని గమనిస్తూ ఉండాలి.
● ఆత్మవిశ్వాసం, పాజిటివ్ థింకింగ్ పుస్తకాలు, బిహేవియర్ థెరిపీ, కౌన్సెలింగ్ ప్రక్రియలు శక్తివంతంగా ఉపయోగపడతాయి.
● వీలైనంత వరకు ఆత్మహత్య భావన ఉన్న వారికి అందుకు సహకరించే వస్తువులను అందుబాటులో లేకుండా చూడాలి. ఆత్మహత్యకు పాల్పడతారనే అనుమానం ఉన్న వ్యక్తులను తన వద్దకు తీసుకు వస్తే కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో మార్పు తీసుకవచ్చేందుకు ప్రయత్నిస్తా. పూర్తి వివరాలకు సెల్ 9346708090 నెంబరును సంప్రదించాలి.

- డాక్టర్ సురేష్‌బాబు, మానసిక వైద్య నిపుణుడు



ఆర్.కృష్ణయ్య నుంచి నియామకపు పత్రాన్ని అందుకుంటున్న సుభాష్ యాదవ్

బీసీ సంక్షేమ సంఘం యువత అధ్యక్షుడిగా సుభాష్

నెల్లూరు (హరనాధపురం) జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం కార్య నిర్వాహక అధ్యక్షుడిగా మద్దులూరి సుభాష్‌యాదవ్ నియమితులయ్యారు. సుభాష్‌ను నియమిస్తూ గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు. యువజన విభాగానికి కార్య నిర్వాహక అధ్యక్షుడుగా తనను నియమించినందుకు ఆనందంగా ఉందని సుభాష్ అన్నారు.

సెల్‌ఫోన్ కోసం హత్య : నిందితులిద్దరికి జీవిత ఖైదు

నెల్లూరు (లీగల్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ కోసం ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశారన్న కేసులో నేరం రుజువు కావడంతో మొఘల్ అక్బర్, సయ్యద్ జావీద్‌లకు జీవితఖైదు విధిస్తూ నెల్లూరు మూడో అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి యల్.తేజోవతి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, నెల్లూరులోని విక్రమ్ నగర్‌లో నివాసం ఉండే మల్లిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి బీటెక్ చదివి, సంగంలోని ఫెడరల్ బ్యాంక్‌లో లోన్‌ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. అతడికి వివాహం కూడా నిశ్చయమైంది. 2021 జనవరి 8న వివాహం జరగాల్సి ఉంది. ఈ నేపధ్యంలో అతను 2020 డిసెంబరు 6న విజయవాడ నుంచి నెల్లూరు వచ్చాడు. ఏడో తేదీ రాత్రి 12.15 గంటల ప్రాంతంలో కరెంట్ ఆఫీసు సెంటర్‌లోని కార్ జోన్ వద్ద ఉండగా డైకస్ రోడ్డుకు చెందిన మొఘల్ అక్బర్, సయ్యద్ జావీద్‌లు పుట్టినరోజు వేడుకలు చేసుకుని కిళ్లీ కోసం ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చి, కరెంట్ ఆఫీస్ సెంటర్ మీదుగా తిరిగి వెళుతున్నారు. ఆ సమయంలో రవీంద్రనాథ్‌రెడ్డి ఒంటరిగా ఫోన్‌లో మాట్లాడుతుండడం కనిపించింది. ఆ ఫోన్ బాగుండడంతో నిందితులిద్దరు రవీంద్రనాథ్‌రెడ్డి వద్దకు వచ్చి ఫోన్ ఇవ్వమని అడిగారు. ఆయన ససేమిరా అన్నాడు. వారి మధ్య మాటామాటా పెరగడంతో రవీంద్రనాథ్‌రెడ్డితో మొఘల్ కలబడ్డాడు. దీంతో కోపోద్రిక్తుడైన అక్బర్ వెంటనే బొడ్డులోని కత్తి తీసి రవీంద్రనాథ్‌రెడ్డి ఛాతీపై పొడిచి అక్కడ నుంచి వారిద్దరు పరారయ్యారు. రవీంద్రనాథ్‌రెడ్డి తనకు పెళ్లి కుదర్చిన వారికి ఫోన్‌చేసి మాట్లాడలేక కింద పడిపోయాడు. సమాచారం అందుకున్న వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి, అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచారు. వేదాయపాళెం సీఐ పీ రామక్రిష్ణ కేసు విచారణ చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో ఆ ఇద్దరిపై నేరం రుజువు కావడంతో న్యాయాధికారి పైవిధంగా జైలుశిక్షతోపాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మిస్సింగ్ కేసులపై ప్రత్యేక బృందాల ఏర్పాటు : ఏఎస్పీ



నెలవారీ నేర సమీక్షలో మాట్లాడుతున్న ఏఎస్పీ సీహెచ్ సౌజన్య

నెల్లూరు(క్రైం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మిస్సింగ్ కేసులపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, వెంటనే కేసులు ఛేదించాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య పోలీసు అధికారులను ఆదేశించారు. నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. జిల్లాలో చోటుచేసుకున్న గ్రేవ్, నాన్ గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాల్లో రికవరీల గురించి సర్కిళ్ల వారీగా సమీక్షించారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ చిన్నపిల్లలు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై అలసత్వం ప్రదర్శించరాదన్నారు. ప్రజలకు సీసీ టీవీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించి, అవగాహన కల్పించాలన్నారు. మార్చి 8న జరగనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలన్నారు. గ్రామ సందర్శనలు, పల్లె నిద్ర కార్యక్రమాలు చేపట్టాలని, పీజీఆర్ఎస్ పిటిషన్లను తక్షణమే పరిష్కరించాలన్నారు. డయల్ 112కు వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకోవాలని, రాత్రి పూట అన్ని స్టేషన్ల పరిధిలో గస్తీలు ముమ్మరం చేయాలన్నారు. నాన్ బెయిల్‌బుల్ వారెంట్ కేసుల్లో జైలు శిక్ష అనుభవించి మధ్యలో పెరోల్‌పై బయటకు వచ్చిన నిందితులను గుర్తించి వారిని తిరిగి కోర్టుకు అప్పగించడంలో ఆలస్యం చేయకూడదన్నారు. అనుమానితులు, పాత నేరస్థులపై నిఘా ఉంచి వారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న అనుమానం వస్తే బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



రహదారిపై ఆవుల సంచారం

● ప్రమాదాల బారిన వాహనదారులు

మండలంలోని కాగితాలపూరు క్రాస్ రోడ్డుపై ఆవుల సంచారంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మనుబోలు, జట్లకొండూరులలో ఆవులు రోడ్డుకు అడ్డంగా వస్తుండడంతో పలువురు ప్రమాదాల బారిన పడడం, వాహనాలు దెబ్బతినడం కొంత కాలంగా జరుగుతూనే ఉంది. సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై ఆవులు సంచరించకుండా చర్యలు తీసుకుని ప్రమాదాలు నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించండి : డీఎంహెచ్‌వో



జిల్లాలో కుష్ఠు వ్యాధిని నిర్మూలిస్తామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌వో, వైద్యాధికారులు

నెల్లూరు (వైద్యం) జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వలో డాక్టర్ సుజాత ఆదేశించారు. గురువారం నగరంలోని జీజీహెచ్‌లో కుష్ఠువ్యాధి విభాగాన్ని ఆమె తనిఖీచేసి, అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గురువారం నుంచి ఫిబ్రవరి 13 వరకు ప్రతి గ్రామంలో సర్పంచిల ఆధ్వర్యంలో వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఇందులో పంచాయితీ కార్యదర్శులు, ఏఎన్ఎం, ఆశాలు, అంగన్‌వాడీలు, వలంటీర్లు పాల్గొని కుష్ఠువ్యాధి నివారణపై ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు.అనంతరం కుష్ఠువ్యాధి నివారిస్తామంటూ వైద్యులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటుండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, కుష్ఠువ్యాధి నివారణ అధికారి డాక్టర్ సురేంద్రబాబు, డాక్టర్ సునీత, సతీష్, నారాయణ, మల్లమ్మ, సుబ్బయ్య, ప్రసాదాచారి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకానికి మరణం లేదు : మాజీ ఎమ్మెల్సీ విఠపు



సభలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పుస్తకానికి మరణం లేదని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. నగరంలోని వీఆర్సీ మైదానంలో జరుగుతున్న సింహపురి పుస్తక మహోత్సవంలో భాగంగా ఆరుద్ర సాహిత్య వేదికపై 'నేను చదివిన పుస్తకం' అనే అంశంపై గురువారం రాత్రి ఆయన తన అనుభూతులను తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలల్లో పాఠ్యాంశాలతో పాటు పాఠ్యాంశారేతర పుస్తకాలను కూడా విద్యార్థులకు పరిచయం చేయగలిగితే వారి భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. ప్రాథమిక స్థాయి నుంచి పీజీ స్థాయి వరకు విద్యార్థులకు పాఠ్యాంశేతర పుస్తకాలను పరిచయం చేస్తే వారు పుస్తక ప్రియులుగా మారతారని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కన్వీనర్ కే లక్ష్మయ్య, పాతూరి అన్నపూర్ణ, చలంచర్ల భాస్కర్‌రెడ్డి, గంగిశెట్టి శివకుమార్, గోవింద రాజుల సుభద్రాదేవి, చిన్ని నారాయణరావు, డాక్టర్ కాలేషాబాషా, మెట్టు రామచంద్ర ప్రసాద్, అవ్వారు శ్రీధర్‌బాబు, ఇంద్రగంటి మధు, మాల్యాద్రి, తదితరులు తాము చదివిన పుస్తకాల గురించి అనుభూతులను పంచు కున్నారు. పుస్తక పరిచయం కార్యక్రమాన్ని ఈతకోట సుబ్బారావు నిర్వహించారు. సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి పీ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వధువు కావలెను

చెన్నై వాస్తవ్యులు, ఏకైక కుమారుడు, బలిజ కులానికి చెందిన వయస్సు 30 సం.లు, 5.5 ఎత్తు, B.E., M.S., (USA) చదువు, సొంత వ్యాపారం – డిజిటల్ మార్కెటింగ్, కుటుంబ వ్యాపారం, గత 30 సంవత్సరాలుగా పుస్తక ప్రచురణ కర్తలు, మరియు పుస్తక ఎగుమతిదారులుగా బాగా స్థిరపడిన కుటుంబం గల అబ్బాయికి చదువుకున్న సంప్రదాయకరమయిన తెలుగు అమ్మాయి రాష్ట్రాలు లేదా ఇతర దేశాలు కూడా కావచ్చు.

సంప్రదించండి: 9840445567
wjsurresh@gmail.com

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

రెండు బస్సు యాత్రలు

1. ఒరిస్సా తేది. 07-02-25. 4రో టికె 8000/-, 2. కర్ణాటక తేది. 22-02-25. 6రో టికె 11,000/- (రూం+భోజనం) కె.వాసు. నెల్లూరు సెల్: 94913 40504

AJR-205521

PLOT FOR SALE

నెల్లూరుకి అతి దగ్గరలో మట్టెంపాడు, ఆమంచర్ల పొదలకూరుకి మెయిన్ రోడ్డు నుడా లేఔట్ అం: 59 వేలు, బ్యాంకు లోన్ సౌకర్యం, స్పాట్ రిజిస్ట్రేషన్ పై 4 గ్రా.ల గోల్డ్ కాయిన్. ఫ్రీ సెల్: 9180086 15946

AJR-205714

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

న్యూస్ బాక్స్

హద్దు రాళ్ల తొలగింపు

కావలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అధికారులు పట్టణంలో అక్రమ లేఅవుట్లను గుర్తించి కొరడా ఝుళిపించారు. గురువారం వెంగాయగారి పాలెంలో సర్వే నంబరు 443, 444, 445లో ఆరు ఎకరాల్లోని అక్రమ లేఅవుట్లను పరిశీలించి హద్దు రాళ్లు, రోడ్లు, కాలువలను ఎక్స్‌కవేటర్‌తో తొలగింపజేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, పట్టణ ప్రణాళికాధికారి వివేకా నంద సిబ్బంది ఉన్నారు.

ఆర్వోబీ పనుల పరిశీలన

కావలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉదయగిరి రోడ్డులోని ఆర్వోబీ వంతెన నిర్మాణ పనులను గురువారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పరిశీలించారు. మరమ్మతులు చేపడుతున్న హైవే సిబ్బందితో పనుల వివరాలు తెలుసుకున్నారు. నాణ్యతతాప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు .

జంగిల్ తొలగింపు

లింగసముద్రం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): 16గ్రామ పంచాయతీల్లోని చెత్త సంపద కేంద్రాల వద్ద పిచ్చి చెట్లతో నిండి ఉన్న జంగిల్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్టు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. గురువారం చినపవని చెత్త సంపద కేంద్రం వద్ద ఉన్న జంగిల్‌ను ఎక్స్‌కవేటర్‌తో తొలగింపజేశారు. ఎరువుల తయారీకి వినియోగించే తొట్లలోని జంగిల్‌ను కూడా తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో సోంపల్లి మనోహర్, కార్యదర్శి రషీద్ ఉన్నారు.

హక్కులపై అవగాహన

ఉలవపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు లావణ్య గురువారం స్థానిక వరిగచేను సంఘం గిరిజన ప్రాథమిక పాఠశాలలో జరిగిన పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొన్నారు. కాలనీవాసులు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. విద్యార్థుల ఆధార్, పుట్టిన తేదీ సర్టిఫికెట్ల కోసం ఇబ్బంది పడుతున్నట్లు హైస్కూల్ హెచ్ఎం శివనాగేశ్వరరావు, ఎంఈవో-2 రమణయ్యలు తహసీల్దారు లావణ్య దృష్టికి తీసుకెళ్లారు. స్థాక సమస్యలపై వివిధ శాఖల అధికారులు చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ, విద్యుత్ ఏఈ శ్రీనివాస్, కార్యదర్శి వీరయ్య, ఉన్నారు. పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

ఆత్మకూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ గంగాప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు. క్యాంటీన్‌లో భోజనం చేసున్న వారిని కూరలు రుచిగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి ఆయన భోజనం చేశారు.

నిర్మాణ పనుల ప్రారంభం

ఉదయగిరి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం సమీపంలో నూతన మురుగు కాలువ నిర్మాణ పనులను గురువారం ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి ప్రారంభించారు. త్వరితగతిన పనులు పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు, నాయకులు ఎంఏ రియాజ్, ఉప్పుటూరి శ్రీనివాసులు, హరి, యస్థాన్, ఖాదర్‌బాషా, జబీవుల్లా పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ పరిశీలన

సంగం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వంగల్లు డంపింగ్ యార్డును ఈవోపీఆర్డీ వరప్రసాద్ గురువారం పరిశీలించారు. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో సేకరించే పొడి, తడి చెత్తను వేరుచేసి సంపద సృష్టించేందుకు డంపింగ్ యార్డులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో వెంట కార్యదర్శి, సర్పంచ్ పాల్గొన్నారు.

వైభవంగా ఉత్సవాలు

దుత్తలూరు(ఉదయగిరి), జనవరి 30 (ఆంధ్రజ్యోతి):నర్రవాడ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీజనార్దనస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా వచ్చేనెల 2, 3వ తేదీల్లో చిన్న జీయర్ స్వామి ప్రవచనాలు ఉంటాయన్నారు.

సబ్సిడీపై అవగాహన

ఉదయగిరి రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి జయశ్రీ అన్నారు. గురువారం అప్పసముద్రంలో పర్యటించిన ఆమె రైతులతో చర్చించి పథకాలపై అవగాహన కల్పించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు, డ్రిప్ పరికరాలకు దరఖాస్తు చేసుకున్న రైతులు అదేరోజు నగదు చెల్లించి పరికరాలు తీసుకోవాలని సూచించారు. అలాగే అవసరమైన రైతులు సైతం రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసు కోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు శేఖర్, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఏఎస్ పేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాల కోసం ఫిబ్రవరి 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ప్రసన్నకుమారి గురువారం ప్రకటనలో తెలిపారు. బీసీ, ఎస్సీ, ఇతర కార్పొరేషన్ల ద్వారా 53మందికి రూ.115.78లక్షలు సబ్సిడీ అందిస్తామని తెలిపారు. కుల ము, పుట్టిన తేదీ, రేషన్, ఆధార్ కార్డులు, బ్యాంక్ పాసుబుక్, ఫోటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సగానికి తగ్గిన దిగుబడులు

- ఎకరానికి 20-25 బస్తాల లోపే..
- తలలు పట్టుకుంటున్న అన్నదాతలు

జలదంకి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈ ఏడాది సాగు చేసిన వరిపంట దిగుబడి సగానికి తగ్గిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్‌లో ఎక్కువ మంది రైతులు కెఎన్ఎం 1630రకంను సాగు చేశారు. ప్రారంభదశలో పైరుగానే కన్పించినా పిలకలు వచ్చే దశలోనే వెన్ను వచ్చిందని వాపోతున్నారు.

● బీకె అగ్రహారం కాకమ్మ చెరువు సాగు నీటిసంఘం అధ్యక్షుడు లింగంగుంట వెంకటేశ్వర్లు 3ఎకరాల మాగాణిలో వరిపంట సాగుచేశాడు. మూడురోజుల కిందట వరికోత కోశాడు. కల్లంలోనే దళారీకి ధాన్యంను అమ్మారు. తేమ శాతం కింద బస్తాకు 3కిలోలు తీసేశా డు. ఎకరానికి 20బస్తాల దిగుబడి వచ్చింది.

● ఇదే గ్రామానికి చెందిన గన్నవరం వెంకటేశ్వర్లు 2ఎకరాలు పొలంలను కౌలుకు తీసుకుని వరికోత సాగుచేశాడు. ఎకరానికి 22బస్తాలు వచ్చాయి. అలాగే వంటేరు దశరథ రామిరెడ్డి 2ఎకరాలు వరికోత కోయగా 24బస్తాల దిగుబడి వచ్చింది. రైతులు ముగ్గురూ కెఎన్ఎం 1638 రకం వరిసాగు చేసినట్లు తెలిపారు. దిగుబడులు చూసి ఇవేం దిగుబడులు బాబోయ్ అని తలలు పట్టుకుంటున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి అందవని చెబుతున్నారు. సొంత పొలం రైతుల పరిస్థితే ఇలా ఉంటే కౌలుకు తీసుకున్న రైతులకు ఎకరానికి రూ.20వేలు నష్టం వచ్చిందని తెలిపారు. మార్కెట్లో మంచి ధర పలికే మసూరి రకం కెఎన్ఎం1638, ఆర్ఎన్ఆర్ రకాలు విత్తనాలు సాగు చేసినా పరిస్థితి ఇలాగే ఉందని చర్చించుకుంటున్నారు. ముసురు వర్షాలతో వాతావరణంలో వచ్చిన మార్పులు మరో కారణంగా చెబుతున్నారు. చెరువులు, కాలువల్లో సాగునీరు పుష్కలంగా సాగునీరు ఉన్నా ఈ ఏడాది అధిక లాభాలు వస్తాయని ఆశించిన రైతులకు మాత్రం నిరాశే మిగిలింది.



బీకే అగ్రహారానికి వెళ్లే రోడ్డులో ధాన్యం రాశి

గాంధీ మార్గం.. ఆచరణీయం

- ఎమ్మెల్యే కృష్ణారెడ్డి
- జాతిపితకు ఘన నివాళి



ఆత్మకూరు: నివాళులర్పిస్తున్న హుస్సేనమ్మ తదితరులు

కావలి టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మగాంధీ మార్గం ఆచరణీయమని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మాగుంట పార్వతమ్మ రోడ్డు వద్ద నున్న గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అలేఖ్య, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తటవర్తి రమేష్, విగ్రహ కమిటీ బాధ్యులు తిరివీధి ప్రసాద్, గుత్తికొండ కిషోర్, పోట్లూరు శ్రీనివాసులు, జ్యోతి బాబురావు, గాదంశెట్టి వేణు పాల్గొన్నారు.

● వైసీపీ ఆధ్వర్యంలో ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి నివాసం వద్ద చేపట్టిన వేడుకలో కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, జడ్పీటీసీ రాఘవులు, కనమర్లపూడి నారాయణ, దామిశెట్టి సుదీర్‌నాయుడు, గంధం ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు.

● సీపీఎం ఆధ్వర్యంలో నేతలు తాళ్లూరు మాల్యాద్రి, పెంచులయ్య, కృష్ణమోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు తటవర్తి రమేష్ ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు.

● జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఆదేశాలతో నేతలు గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.

● జలదంకి: గట్టుపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన కా ర్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి పద్మజ పాల్గొన్నారు. అనంతరం కుష్ఠువ్యాధి నేపథ్యం, నివారణ గురించి వివరించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● లింగసముద్రం:స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షులు వెంకట సుబ్బారావు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జల్లు హజరత్తయ్య, దేవకి సుబ్బారావు, దోరడ్ల వెంకటేశ్వర్లు, దేవకి బసవారావు, దేవకి వెంకట సత్యనారాయణ, దోరడ్ల శ్రీహరి పాల్గొన్నారు.

● ఉలవపాడు: ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బాపనపల్లి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు బలసా సురేష్‌కుమార్, పొన్నూరు రామాంజనేయులు, దివ్యనంద గుప్తా పాల్గొన్నారు.

● కలిగిరి: లోక్ అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి నాగసముద్రం పంచాయతీ వడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొ నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త దొరసానమ్మ పాల్గొన్నారు.

● ఆత్మకూరు: పట్టణంలో యుపిహెచ్‌సిలో జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ మెడికల్ ఆఫీసర్ షేక్ అస్మా, వైద్య సిబ్బందితో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుష్ఠు వ్యాధి నివారణపై ఏఎన్ఎంలకు, ఆశావర్కర్లుకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ఎస్ సుధాకర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● కందుకూరు: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు, మురారిశెట్టి సుధీర్, గుర్రం అల్లూరయ్య, చక్కా కేశవరావు, చీదెళ్ల వేణు, కాకుమాని ప్రవీణ్, పబ్బిశెట్టి రాజా ఉన్నారు. అలాగే పెద్దబజారు గాంధీ విగ్రహం వద్ద విగ్రహ కమిటీ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, వరదరాజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

● సంగం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని జాతిపిత విగ్రహానికి పూలమాల వేసి ఆర్యవైశ్యులు నివాళులర్పించారు. ఈవోపీఆర్డీ వరప్రసాద్, ఆర్యవైశ్యులు గిరి, ప్రభాకర్, శ్రీరామ్, రాజ పాల్గొన్నారు.

● ఉదయగిరి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవో సీహెచ్ పద్మజ, జూనియర్ అసిస్టెంట్ అబ్దుల్ సమద్, టీడీపీ యూత్ నాయకుడు చింతనబోయిన శివకృష్ణ, సిబ్బంది ఇమ్రాన్, లక్ష్మీ, మస్తాన్ పాల్గొన్నారు.

● వింజమూరు: ఎండీవో కార్యాలయంలో గాంధీ విగ్రహానికి తెలుగుదేశం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కోడూరు నాగిరెడ్డి, పాములపాటి మాల్యాద్రి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంగయ్య, మండల ఐటీడీపీ అధ్యక్షుడు ఆరికొండ శ్రీనివాసుల పాల్గొన్నారు.



కావలి టౌన్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి



కందుకూరు: నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య ప్రతినిధులు



సంగం: నివాళులు అర్పిస్తున్న అధికారులు



ఉదయగిరి: నివాళులర్పిస్తున్న సిబ్బంది



లింగసముద్రం: నివాళులర్పిస్తున్న వెంకటసుబ్బారావు



వింజమూరు: పాల్గొన్న ఎమ్పీడీవో కార్యాలయ సిబ్బంది



కలిగిరి: నివాళులర్పిస్తున్న మాలకొండారెడ్డి

ప్రతి ఇంటికీ మంచినీరిస్తాం

● శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కావలి



కావలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రతి ఇంటికి కొళాయిలతో తాగునీరందించటమే లక్ష్యంగా ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు మున్సి పల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం పట్టణంలోని కొన్నిచోట్ల మాత్రమే ట్యాంకర్లతో నీరు చేస్తున్నట్లు చెప్పా రు. అన్ని ప్రాంతాలకు మంచినీటి పైపులైన్లు విస్తరింప జేస్తా మన్నారు.

? నీటి సరఫరా ఎలా చేస్తున్నారు.

! ట్యాంకర్లు లేకుండా ప్రతి ఇంటికీ కొళాయితో తాగునీరు అందించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నాం.

? పట్టణంలో ఎన్ని గృహాలు ఉన్నాయి.

! ప్రస్తుతం 25వేల గృహాలున్నాయి. అన్నికాలనీల్లో కలిసి 6,900 కొళాయి కనెక్షన్‌లు ఉన్నాయి

? అక్రమ కనెక్షన్‌లు ఉన్నాయా

! వెయ్యి అక్రమ కొళాయి కనెక్షన్‌లు ఉన్నాయి. వాటిపై కనెక్షన్‌లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. మంచినీటి పైపులైన్లు లేని ప్రాంతాలలో అమృత్ పథకం కింద పైపులైన్లు వేస్తాం. అలాగే ప్రతి ఇంటికి కొళాయి ద్వారా తాగు నీరు అందిస్తాం.

సంగసానిపల్లిలో ప్రముఖులు

సీతారామపురం(ఆంధ్రజ్యోతి):సంగసానిపల్లిలో గురువారం మాజీ సొసైటీ అధ్యక్షుడు వెంగళశెట్టి వెంకటయ్య పెద్దకర్మ కార్యక్రమంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, బొల్లినేని రామారావు, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి పాల్గొన్నారు. వెంకటయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మండల చెన్నకేశవులు, జామవా, పిడుగు రమేష్, భోగినేని కాశీరత్తయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎమ్మెల్యే ఇంటూరి

వలేటివారిపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అధికారులు.. ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండల కార్యాలయంలో ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8నెలల్లోనే పంచాయతీరాజ్ వ్యవస్థలను పటిష్ఠం చేసినట్లు తెలిపారు. ఆరునెలల్లోనే నియోజకవర్గంలోని సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.15కోట్లు ఇచ్చిందన్నారు. తారురోడ్ల నిర్మాణానికి రూ.9కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నుంచి కందుకూరు నియోజకవర్గానికి తాగు, సాగునీటి సరఫరాకు కృషి చేస్తా మన్నారు. రీసర్వేలో జరిగిన తప్పులను సరిచేసేందుకు మండలానికి ఒక రెవెన్యూ గ్రామమును పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నట్లు తెలిపారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు విప్లవాత్మక మార్పులు తీసుకరానుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఇంటూరి భారతి, ఎంపీడీఓ నరేంద్రదేవ్, డిప్యూటీ తహసీల్దార్ నాయబ్‌రసూల్ ఎంపీటీసీలు చింతలపూడి రవీంద్ర, చౌడబోయిన యానాది, వడ్లమూడి జయమ్మ, సర్పంచ్‌లు సతీష్, అమరేశ్వరి నవ్వులూరి రాజారమేష్ పాల్గొన్నారు.



వీవీపాలెం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

● బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

కొండసముద్రంలో ఇటీవల మృతి చెందిన నెల్లూరు జిల్లా టెలికాం బోర్డు సభ్యులు గుర్రం మాల్యాద్రి అమ్మమ్మ ఇంటూరి సుబ్బమ్మ దిశదినకర్మలో ఎమ్మెల్యే పాల్గొని కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు ప్రకాశం జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, టీడీపీ మండలాధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం ఉన్నారు.

● మురుగునీటి శుద్ధి ప్లాంట్‌కు శంకుస్థాపన

కందుకూరు: పట్టణంలో మురుగునీటి కాలుష్యాన్ని తగ్గించి ప్రజలకు పరిశుభ్రత, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం కోసం రూ.19.40 కోట్లతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో మురుగునీటి శుద్ధి ప్లాంటు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, డీఈఈ గణపతి, పార్టీ పట్టణాధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నాయకులు చిలకపాటి మదుబాబు, షేక్ రఫీ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, వడ్డెవల్లి వెంకటరావు, దివి మాధవరావు, నల్లూరి వీరరాఘవు పాల్గొన్నారు.

జడ్పీ డిప్యూటీ సీఈవో ఆకస్మిక తనిఖీ

కావలి రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గౌరవరం స చివాలయాన్ని గురువారం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిరు వ్యాపార సముదాయాల వివరాలు, ఈకేవైసీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సభ్యుల ఈకెవైసీ, స్కూల్, ల్యాండ్ రికార్డులు, ఆరోగ్యశ్రీకార్డులు,జియోట్యాగింగ్ సర్వేల వివరాలు, సచివాలయ రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం మండల కార్యాలయానికి వెళ్లి 15వ ఆర్థిక సంఘం నిధుల వివరాలు, సచివాలయాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వే ప్రగతి, అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీదేవి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ అబ్దుల్ సమద్, కార్యదర్శి అఖిల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న మోహన్‌రావు

విద్యకు మించిన విలువ దేనికీ లేదు: ఎమ్మెల్యే దగుమాటి

కావలి టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యను మించిన విలువ దేనికీ లేదని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక మనోహర్‌రెడ్డి, నారాయణ కల్యాణ మండపంలో పాతూరు శ్రీచైతన్య జూనియర్ కళాశాల 23వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కరస్పాండెంట్ వెంకయ్య, ప్రిన్సిపాల్ లుకోధర్ అధ్యతన జరిగిన కార్యక్రమంలో జబర్దస్త్ ఫేమ్ అప్పారావు, నవీన్, వినోదిని అలరించారు. ర్యాంకులు చ్చిన విద్యార్థులకు నగదుతో పాటు ప్రోత్సాహక బహుమతులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బెజవాడ రవికుమార్, డైరెక్టర్‌లు ప్రసాద్, కొండయ్య, మధుసూదన్‌రావు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

● కందుకూరు: ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి అని చెప్పుకోటానికి గర్వపడతానన్నారు. కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. అనంతరం విద్యా ర్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగూర్‌వలీ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

●ఉలవపాడు: ఉలవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథులుగా ఎంఈవో-1 శివనాగేశ్వరరావు, పెద్దపట్టపుపాలెం, చాకిచర్ల హెచ్ఎంలు ఎస్‌కే సలీం బాషా, జనార్ధనరావులు పాల్గొన్నారు. కార్యక్రమంలో లెక్చరర్ గోపిచంద్ ప్రకాష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



కావలి: సందడి చేస్తున్న జబర్దస్త్ ఫేమ్ ఆర్టిస్ట్‌లు అప్పారావు, నవీన్, వినోదిని

● బిట్రగుంట: విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో పూర్వపు విద్యార్థుల ఆధ్వర్యంలో 50 ఏళ్ల వసంతోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎంఈవోలు నరసింహారావు, జయమ్మ, సరస్వతి నమఃసుబ్బ్యం వ్యవస్థాపకులు ప్రసాద్‌రావులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉన్నారు.

హెల్మెటే ద్విచక్ర వాహనదారులకు రక్ష

కావలి రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ వాడకం ప్రమాదకర సమయంలో ద్విచక్ర వాహనదారులకు రక్ష అని ఆర్టీవో వై.సుధాకర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో ఆర్టీవో సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సుందర్‌రావు పర్యవేక్షణలో గురువారం హెల్మెట్ వాడకంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా ఆర్టీవో మాట్లాడారు. హెల్మెట్ లేకుండా పట్టుపడితే జరిమానా విధిస్తామన్నారు. కార్లు నడిపేటపుడు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలన్నారు. అనంతరం బ్రిడ్జి కూడలి నుంచి ఆర్టీవో కార్యాలయం వరకు మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ సుంధర్‌రావు, అసిస్టెంట్ మోటారువెహికల్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, లక్ష్మీభాయ్, 1వ పట్టణ ఎస్ఐ అంబేద్కర్, సిబ్బంది ఉన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్టీవో

కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన పెంచుకోండి

సీతారామపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బసినేనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో విద్యార్థులకు కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం ఉదయ్‌కుమారి, ఎంపిహెచ్ఇవో మజీద్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్వప్న

● ఇంటింటికీ తిరిగి సర్వే చేయాలి

● ఏఎస్ పేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు సురేష్‌బాబు మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించాలని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రషీద్, వైద్యఆరోగ్య, గ్రామ పెద్దతలు తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

సంగం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పశువైద్యాధికారి సురేష్ గురువారం స్థానిక పశు వైద్యశాలలో పశు ఆరోగ్య వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువులకు నట్టల నివారణ మందు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైద్యశాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● సీతారామపురం: పశు వైద్యశాల సహాయ సంచాలకులు తమ్మిశెట్టి శిల్ప సూచించారు. సీతారామపురం గ్రామ పంచాయతీలోని నారాయణంపేట, పోలంగారిపల్లి గ్రామాలలో గురువారం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలంగారిపల్లి సర్పంచ్ వెంకటసుబ్బయ్య, ఏహెచ్ఏ కొండయ్య, షంషుద్దీన్, మహేశ్వరి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

దుత్తలూరు(ఉదయగిరి), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మంచినీటి పథకాల మరమ్మతులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. ప్రజాప్రతినిధులు సమస్యలను సభ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. బడుగు, బలహీనవర్గాలకు సబ్సిడీ రుణాలు మంజూరయ్యాయని, అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు వారి వారి ప్రగతిని సభలో వినిపించారు. అనంతరం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లెక్కల లక్ష్మీకాంతమ్మ, ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు, పలువురు ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ జయంత్‌రెడ్డి

ప్రాథమిక దశలోనే కుష్ఠు వ్యాధిని గుర్తించాలి



స్వర్ణభారత్ ట్రస్ట్ వద్ద నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఖాదర్‌వలి, వైద్య సిబ్బంది

వెంకటాచలం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలోనే కుష్ఠువ్యాధి లక్షణాలను గుర్తించినట్లయితే సకాలంలో వైద్య సేవలు అందించి నివారించవచ్చని జిల్లా అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. స్థానిక స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలోని నారాయణ రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ (నారాయణ వైద్యశాల) వద్ద గురువారం కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మెడిసిన్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అలీ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కే విద్యాసాగర్, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

గురుకుల పాఠశాలలో...

మండలంలోని చవటపాళెం పంచాయతీ ఎర్రగుంట వద్ద ఉన్న బాలుర గురుకుల పాఠశాలలో గురువారం కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవళిక వ్యాధిపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ ఖాదర్‌వలి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పరమేశ్వర రావు, సీహెచ్‌వో రామసుబ్బారెడ్డి, డీపీఎంవో వెంకటేశ్వర్లు, హెచ్ఎస్ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

● సైదాపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ ఆధ్వర్యంలో గురువారం కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిత్యప్రశాంతి మాట్లాడుతూ మహాత్మాగాంధీ కన్న కలలను సాకారం చేస్తూ కుష్ఠు రహిత గ్రామాలుగా చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ సొరకాయల శెట్టి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులకు దుప్పట్ల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెంలోని అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్ అధ్వర్యంలో గురువారం ప్రపంచ లెప్రసీడేతోపాటు మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆరోగ్య సిబ్బంది లెప్రసీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రిజిస్ట్రాఫీస్ సెంటర్‌కు చేరుకున్న ర్యాలీ మానవహారం నిర్వహించి లెప్రసీపై అవగాహన కల్పించారు. గత 10రోజులుగా బుచ్చి నగర పంచాయతీ పరిధిలో చేస్తున్న లెప్రసీ సర్వే, లక్షణాలు గురించి వివరించారు. లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో బుచ్చి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

దాణా తయారీపై రైతులకు శిక్షణ

ముత్తుకూరు : తక్కువ ఖర్చుతో స్థానికంగా లభించే పదార్థాలతో పశువుల మిశ్రమ దాణా తయారీ విధానంపై అదానీ ఫౌండేషన్ గురువారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. కృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమంలో చిల్లకూరు మండల మోమిడి పశుసంవర్ధక కేంద్రం అసిస్టెంట్ సర్జన్ షిరాజ్‌ఖాన్ ఆధ్వర్యంలో లింగవరం గ్రామ వెటర్నరీ అసిస్టెంట్ హరీష్, మోమిడి గ్రామ పశువైద్యాధికారి జగ్రెష్ పశువుల మిశ్రమాన్ని ఎలా తయారు చేయాలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదానీ ఫౌండేషన్ హెడ్ రాజేష్‌రంజన్, షేక్ షాహుల్ హమీద్, డాక్టర్ సీహెచ్ రమేష్‌బాబు, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన మొహమ్మద్ అబ్దుల్ రహమాన్ తండ్రి అబ్దుల్ సలాం, డోరు నెం.7-4-108ను, పెద్ద రోడ్డు, గురుతోట, రంగనాయకులపేట, నెల్లూరుసిటీ వారు ఇచ్చిన వివరముల మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా:- నా క్లయింట్ నెల్లూరు నగరం, రంగనాయకులపేట, ఇనుప లంక రోడ్డు "షా సాహెబ్ మహల్లా"లోని వార్డు నెం.?ను, డోరు నెం.690ను సమీపమున 30 అంకణములు స్థలమును సయ్యద్ అస్మత్ బేగం, భర్త సయ్యద్ మొహమ్మద్ గౌస్ ఖాదరి అనువారి వద్ద నుండి రిజిస్టర్డు విక్రయపత్రం తేది:29-08-2009 డాక్యుమెంటు నెం.7147/2009 ద్వారా కొనుగోలు చేసినారు. సదరు ఒరిజినల్ డాక్యుమెంటు మరియు దీని యొక్క లింకు డాక్యుమెంటు అనగా రిజిస్టర్డు సెటిల్‌మెంట్ పత్రం తేది.26-06-1985 డాక్యుమెంటు నెం.3744/1985 ఒరిజినల్స్‌ను నా క్లయింట్ తనకు నెల్లూరు సిటీ, ఆచారివీధిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మెయిన్ బ్రాంచీలో 2022 సంవత్సరం నుండి లాకర్ సదుపాయం కలిగి (లాకర్ నెం.2/3019) సదరు లాకర్‌లో సదరు ఒరిజినల్ డాక్యుమెంట్లు ఉంచి, చివరిసారిగా తే.06-05-2024దిన లాకర్ ఓపెన్ చేసి చూడగా పై తెలిపిన ఒరిజినల్ డాక్యుమెంట్లు సురక్షితముగా వున్నవి. తదుపరి నా క్లయింట్ తే.18-01-2025దిన లాకర్ ఓపెన్ చేసి చూడగా లాకర్‌లో వున్న డాక్యుమెంట్లుకు చెదలు పట్టి పూర్తిగా ఉపయోగం లేకుండా పోయినవని గుర్తించి నా క్లయింట్ బ్యాంక్ వారికి తెలియజేయగా, సదరు బ్యాంక్ వారు లాకర్‌ను పరిశీలించి ఒరిజినల్ డాక్యుమెంట్లుకు చెదలు పట్టి పూర్తిగా ఉపయోగం లేకుండా పోయినవని తే.18-01-2025దిన సర్టిఫికేట్ ఇచ్చి వున్నారు. కావున యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమైనది.

Sk.Yasdani, B.Com., L.L.B., Advocate, Opposite to SBI, Achari Street, Nellore. Cell: 94403 90245

భర్తపై భార్య ఫిర్యాదు

నెల్లూరురూరల్ జనవరి 30, (ఆంధ్రజ్యోతి): తనతో అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు మద్యం తాగి దాడి చేస్తున్నాడని భర్తపై భార్య నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ జీ వేణు గురువారం తెలిపారు. రూరల్లోని మూడవ మైలుకు చెందిన మేఘవర్షితకు 2021లో టీపీగూడూరు మండలం చింతోపు ప్రాంతానికి చెందిన బాలాజీతో వివాహమైంది. వారికి ఓ పాప ఉంది. ఈ క్రమంలో పుటింట్లో ఉంటున్న భార్యతో బుధవారం గొడవ పెట్టుకోవడంతోపాటు మద్యంతాగి వచ్చి కొట్టి ఆస్తికి నష్టం చేసినట్లు ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.



శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానము

దర్గామిట్ట, నెల్లూరు సిటీ, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా. ఫోన్: 0861-2322016
E-Mail:endow-eodmitta@gov.in, Srirajarjaeswariammavaru@yahoo.com

ప్రకటన నెం.02/2025 తేది.30.01.2025

ఇ-టెండరు / సీల్డ్ టెండరు / బహిరంగ వేలం ప్రకటన (2వ సారి)

పై దేవస్థానమునకు సంబంధించి 2025-26 సంవత్సరమునకు క్రింద వివరించిన వివిధ హక్కులు లీజుకు ఇచ్చుటకు, వివిధ వస్తువులు సరఫరా చేయుటకు తేది.10-02-2025 సోమవారము ఉ.గం.10.30లకు ఇ-టెండరు, సీల్డ్ టెండరు, బహిరంగ వేలం దేవదాయశాఖ అధికారుల సమక్షములో దేవస్థానము నందు నిర్వహించబడును.

వ. నెం	వివరములు	ధరావత్తు రూ.	నిర్వహించు విధానము	కాలపరిమితి
1.	కొబ్బరికాయలు, పూజాద్రవ్యములు అమ్ముకొను హక్కు	3,00,000/-	ఇ-ప్రొక్యూర్‌మెంట్/ సీల్డ్ టెండరు / బహిరంగ వేలం పాట	01.04.2025 నుండి 31.03.2026
2.	భక్తులు సమర్పించిన వస్త్రములు సేకరించుకొను హక్కు	2,00,000/-		
3.	దేవస్థాన కళ్యాణ వేదికలో వివాహాది శుభకార్యములు చేసుకొను హక్కు	2,00,000/-		
4.	గాలిగోపురము ముందు దక్షిణం వైపు పూలు విక్రయించుకొను హక్కు	1,00,000/		
5.	గాలిగోపురము ఉత్తరం వైపు పూలు విక్రయించుకొను హక్కు	1,00,000/-		
6.	పాత ఏసీలు & పాత ఇనుము స్క్రాప్ అమ్మకం	25,000/-	బహిరంగ వేలం పాట	ప్రస్తుతం ఉన్న స్టాకు మాత్రమే
7.	అర్చిత సేవలకు పూజా సామగ్రి సరఫరా చేయు హక్కు	50,000/-	ఇ-ప్రొక్యూర్‌మెంట్ / సీల్డ్ టెండరు	01.04.2025నుండి 31.03.2026
8.	పడితరం, అర్చిత సేవలకు పుష్పం సరఫరా చేయు హక్కు మరియు మహాశివరాత్రి ఉత్సవమునకు ముఖ్య పర్వదినములు పుష్పల సరఫరా	25,000/-		20.02.2025 నుండి 31.03.2026
9.	ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయు హక్కు	10,000/-	సీల్డ్ టెండరు	01.04.2025 నుండి 31.03.2026
10.	భోజనాలు, టిఫిన్‌లు ఏర్పాటు చేయుట	10,000/-		

టెండరు షెడ్యూలు 1కి రూ 1000/-లు చెల్లించి తేది.09-02-2025 సా.గం. 5.00ల వరకు పొందవచ్చును. పూర్తి చేసిన షెడ్యూలును తేది.10.02.2025 ఉ.గం10.00 ల లోపు కార్యాలయము నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్స్ నందు దాఖలు చేయవలెను. ఇ-టెండరు వివరములకు www.eprocurement.gov.in లో ap.endowmentsdepartmentmarketing నందు చూడగలరు. ఇతర వివరములకు కార్యాలయము పని వేళల నందు సంప్రదించగలరు.

సహాయ కమీషనర్ & కార్యనిర్వహణాధికారి






నెల్లూరు నగర సుందరీకరణలో భాగంగా గత టీడీపీ ప్రభుత్వంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆత్మకూరు బస్టాండు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి పిల్లర్లకు మురల్ ఆర్ట్ వేశారు. రకరకాల వృత్తులు, కళాకారులు, ప్రముఖుల చిత్రాలను అందంగా ప్రదర్శించారు. అయితే ఆ మురల్ ఆర్ట్ ప్రస్తుతం మాసిపోయింది. నిర్వహణ లోపంతో దుమ్ముకొట్టుకుపోయి కళావిహీనంగా మారింది.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

మురల్ ఆర్ట్ మాసిపోయింది !

ఆదర్శనీయులు గాంధీజీ.. వాడవాడలా ఘన నివాళి


ఏసీ స్టేడియంలో వాకర్స్ ఆధ్వర్యంలో నివాళి


వెంకటాచలం : వీఎస్‌యూ వీసీ ఆధ్వర్యంలో..


ఇందుకూరుపేట : పల్లెపాడులో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నివాళి..


పొదలకూరులో ఆర్యవైశ్యుల నివాళులు

నెల్లూరు(విద్య), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జాతిపిత మహాత్మాగాంధీ అందరికీ ఆదర్శనీయులని ఇంటర్నేషనల్ వాకర్స్ సంఘం ఎలెక్టర్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు అన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గురువారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాకర్స్‌కు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులనాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

● వివేకానంద వాకర్స్ ఆధ్వర్యంలో...

వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గురువారం గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే.గోపీనాథ్, గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

● నగరపాలక ప్రాథమిక పాఠశాలలో...

కొండాయపాళెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్, సోమేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), (ఆంధ్రజ్యోతి): గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం నగరంలోని గాంధీబొమ్మ విగ్రహానికి జనసేన నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు సుజయ్‌బాబు, కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చప్పిడి శ్రీనివాసులురెడ్డి, ఇతర నేతలు గుడ్లూరు నాగరత్నం, షేక్ ఆలియా, శనివారపు అజయ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

● వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి): గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం వాసవీ క్లబ్ నెల్లూరు సిటీ సభ్యులు ఘన నివాళులు అర్పించారు. నగరంలోని గాంధీజీ విగ్రహానికి పుష్పమాలలు వేసి, గాంధీజీ ఆశయాలు కొనసాగిస్తామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాదర్తి బాలాజీ, వేమూరు గిరీష్‌కుమార్, కొండపల్లి రమేష్, సుంకు మోహన్‌సాయి, పాదర్తి సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

● రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రంలో...

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రంలో గురువారం గాంధీ వర్ధంతి జరిగింది. పాలక మండలి సభ్యులు మలిరెడ్డి కోటారెడ్డి, దాసరి రాజేంద్రప్రసాద్, కార్యాలయం కార్యదర్శి మస్తానయ్య పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దివ్యాంగుల కేంద్ర ప్రిన్సిపాల్ గురునాథరావు, రెడ్‌క్రాస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● గాంధీజీ ఆశయం విద్యార్థులకు స్ఫూర్తిదాయకం : వీఎస్‌యూ వీసీ

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆశయం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్ రావు అన్నారు. స్థానిక వీఎస్‌యూలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ -4 ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, కావలి పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ టీ వీరారెడ్డి, సీడీసీ డీన్ హుస్సేనయ్య, హనుమారెడ్డి, సుజయ్‌కుమార్, సాయిప్రసాద్‌రెడ్డి, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

● రాపూరు : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రాపూరు ఎంపీడీవో భవానీ ఆధ్వర్యంలో గురువారం గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులుర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర్లురెడ్డి, ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు

● పొదలకూరు : గాంధీజీ వర్ధంతి సందర్భంగా స్థానిక పంచాయతీ బస్టాండులో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రూరల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం చైర్మన్ అమర్తలూరు చెంచయ్య, పొట్టి సుధాకర్, ఆర్యవైశ్య నేతలు రాచపూటి ధనుంజయరావు, ఆకులూరు విజయ, పిన్నెల ప్రభాకర్, గుర్రం మీరా, మధు, తదితరులు పాల్గొన్నారు.

● ఇందుకూరుపేట, (ఆంధ్రజ్యోతి): సత్యాగ్రహమే ఆయుధంగా అహింస మార్గంలో పోరాడిన వ్యక్తి గాంధీ అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ ఆశ్రమంలో గురువారం ఆశ్రమ కన్వీనర్ గణేశం కల్పనమ్మ, కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ వాకాటి విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గాంధీ వర్ధంతిలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముందుగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వాకాటి విజయ్‌కుమార్‌రెడ్డిలు గాంధీ విగ్రహానికి, ఆశ్రమస్థల దాత పొణకా కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు, పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రచౌదరి, షేక్ ఇంతియాజ్, అవ్వారు ఏడుకొండలు, చింతపంటి వెంకటరమణయ్య, మునగాల రంగారావు, కైలాసం శ్రీనివాసులురెడ్డి, ఆశ్రమ మేనేజర్ మనోజ్ పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం: స్థానికంగా ఉన్న గాంధీ విగ్రహానికి బుచ్చి లయన్స్‌క్లబ్ సంఘం అధ్యక్షులు, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రపంచ లెప్రసీడే సందర్భంగా ప్రభుత్వాసుపత్రిలో రోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం డీఎల్ఎన్ఆర్ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు డ్రగ్స్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, సెక్రటరీ మస్తాన్‌బాబు, ట్రెజరర్ నాగేశ్వరరావు, సభ్యులు రాచూరి సత్యనారాయణ, దరిశి బాలనరసింహులు, కృష్ణారెడ్డి, ఆర్.మల్యాద్రి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● విడవలూరు, (ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీ కళాశాల్లో గాంధీజీ వర్ధంతి గురువారం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చక్రపాణి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ గాంధీ మార్గంలో ప్రతి విద్యార్థి నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మనుబోలు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పశువైద్యశాలలో గురువారం ఉచిత పశువైద్య శిబిరాన్ని స్థానిక టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఏడి గురవారెడ్డి ఆవులు, పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే జీవాలకు నట్టల నివారణ మందు తాగించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడి సూచించారు. ఈ కార్యక్రమంలో నీటిసంఘం అధ్యక్షుడు పచ్చిపాల రామిరెడ్డి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సాని వెంకటరమణయ్య, మనుబోలు విజయా డెయిరీ ప్రెసిడెంట్ పచ్చిపాల శ్రీకాంత్‌రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

డీ వార్మింగ్ తప్పనిసరిగా చేయించాలి

విడవలూరు : పశువులు ఆరోగ్యంగా ఉండాలంటే డీ వార్మింగ్ తప్పనిసరిగా పాడి రైతులు చేయించాలని పశు సంవర్ధక శాఖ ఏడీఏ కృష్ణ మౌర్య తెలిపారు. దంపూరులోని గొల్కొండయ్యతోపు, వరిణి పంచాయతీల్లో గురువారం నిర్వహించిన పశుఆరోగ్య శిబిరంలో ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న పశువులు, గొర్రెలన పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యులు వాణిశంకర్, పాడి రైతులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి ఆలయంలో వేలం పాటలు


వేలం నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆ లయంలో గురువారం 2025 -26 సంవత్సరా నికి ఈ టెండర్, సీల్డ్ టెండర్లకు బహిరంగ వేలంపాటలు జరిగాయి. మొత్తం ఎనిమిదిం టికిగానూ మూడు మాత్రమే వేలం పాటలు జరిగాయి. కొబ్బరిచిప్పలు, పాదరక్షకులు, పుస్తకాలు, సీల్డ్ టెండర్లు కంపార్ట్‌మెంట్ స్టేట్‌మెంట్ చేసిన తర్వాత ఎవరు తక్కువ టెండరుదారో నిర్ణయించారు. మిగిలినవి వా యిదా పడ్డాయి. తిరిగి ఫిబ్రవరి 10న ఈ టెండరు, సీల్ టెండరు బహిరంగ పాటలు నిర్వహిస్తామని జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి ఎస్.శ్రీధర్‌నాయుడు, ప్రధాన అర్చకులు, టెండరుదారులు, తదితరులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమానికి బియ్యం పంపిణీ

నెల్లూరు (వైద్యం) జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రగతి చారిటీస్ మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో సృజన సాంస్కృతిక వేదిక నిర్వాహకులు గురువారం బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. ఆశ్రమంలోని వారికి బిస్కట్ ప్యాకెట్లు, అరటిపండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో సృజన సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ, సంఘం సేవకులు సుజితరెడ్డి, వరపరివార్ సేవా ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవి, మన ఆసుపత్రి అధినేత డాక్టర్ మారం సుధాకర్, పద్మ, లీనా తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో ఎన్ఎంసీ బోర్డులు



ఖాళీ స్థలాలున్న ప్రైవేట్ వ్యక్తులు పన్ను కట్టకుండా తప్పించుకు తిరుగుతుండటంతో వారి ఆటలను కట్టడి చేసేందుకు ఎన్ఎంసీ వినూత్న రీతిలో బోర్డులు ఏర్పాటు చే స్తున్నారు. ఖాళీ స్థలాలను గుర్తించి ఈ చిత్రంలో చూపినట్లుగా ఫ్లెక్సీలు తయారు చేసి అక్కడ ఉంచుతున్నారు. దీంతో కొందరు పరుగెత్తికెళ్లి పన్ను వేయించుకుంటుండగా, మరికొందరు బయటకు రాకుండా ఉండిపోతున్నారు. ఇంకొందరు కార్పొరేషన్‌పై న్యాయపోరాటానికి సిద్ధ పడుతున్నారు. మొత్తంమీద రెవెన్యూ అధికారుల నిర్ణయం నగరంలో వివాదస్పదమైంది. -నెల్లూరు (సిటీ,ఆంధ్రజ్యోతి)

చేనేత రంగానికి అండగా ఉంటాం : గిరిధర్


గిరిధర్‌రెడ్డికి గజమాలతో స్వాగతం

నెల్లూరురూరల్, జనవరి 30, (ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమకు అండగా ఉంటామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అన్నారు. గడప గడపకు... కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని ములుముడిలో ఇంటింటికి వెళ్లి ప్ర జలను పలకరించారు. ముందుగా ఆయనకు గజమాలతో సత్కరించిన గ్రామస్థులు 100 గుమ్మడికాయలతో దిష్టితీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేత కార్మికులకు తొలుత అండగా నిలిచి, భరోసా ఇచ్చిన టీడీపీ ప్రభుత్వమేనన్నారు. రూరల్ నియోజవర్గంలోని నారాయణరెడ్డిపేట, సౌత్‌మోపూ రు, ములుముడి గ్రామాల్లోని చేనేత కార్మికులకు ఏ కష్టమె చ్చినా రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

55 ఏళ్ల సమస్యకు పరిష్కారం : ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, జనవరి 30, (ఆంధ్రజ్యోతి): కలివెలపాళెంలో గత 55 ఏళ్లగా పరిష్కారానికి నోచు కోని శ్మశాన వాటిక సమస్య తన హయాంలో పరిష్కారమవడం సంతోషంగా ఉందని రూరల్ ఎమ్మె ల్యే శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం శ్మశానవాటిక ప్రహరీ గోడ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చే శారు. అనంతరం మాట్లాడుతూ తాను రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్నా ప్రహరీ గోడ నిర్మాణం చేయలేకపోవడం బాధాకరమన్నారు. మూడోసారి ఎమ్మెల్యే అయ్యాక 55 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపడం గ్రామస్థులతోపాటు తనకు ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయకుమా ర్, సురేంద్రరెడ్డి, వెడిచర్ల వెంకటేశ్వర్లు యాదవ్, శ్రీనివాసులురెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

టీబీ కేసుల నమోదు పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి30 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ భవాని గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రంలో నమోదయ్యే టీబీ కేసులు, రోగ నిర్ధారణకు చేసే టీబీ పరీక్షలు అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలిం సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట వైద్యాధికారి అహ్మద్‌బాబు, జిల్లా పీఎండీటీ, టీబీ హెచ్ఐవీ కోర్డినేటర్ శ్రావణ్ కుమార్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ సురేష్, సీనియర్ ట్రీట్‌మెంట్ ల్యాబ్ సూపర్‌వైజర్ నరసింహులు, ల్యాబ్ టెక్నీషియన్ యాసిన్, పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.


మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

ఆదర్శంగా అన్న క్యాంటీన్లు : కమిషనర్


నెల్లూరు(సిటీ), జనవరి 30, (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్న క్యాంటీన్లు ఆదర్శవంతంగా సాగేందుకు చొరవ చూపాలని జిల్లాలోని మున్సిపాలిటీల కమిషనర్లను ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. గురువారం కమిషనర్లు, ప్రత్యేక అధికారులతో కార్పొరేషన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు తక్కువ ధరకు అన్నం పెట్టేందుకు వీటిని తీసుకు వచ్చామన్నారు. ప్రతి క్యాంటీన్‌లో విధిగా ఏడుగురు సిబ్బంది విధుల్లో ఉండాలన్నారు. అవసరమైన చోట్ల సిబ్బందిని పెంచుకోవచ్చని తెలిపారు. కమిషనర్లు, ప్రత్యేక అధికారులు తరుచూ వెళ్లి ఆహారం నాణ్యతను పరిశీలించాలన్నారు.

అనంతరం పబ్లిక్‌హెల్త్‌లోని కార్మికులకు మేస్త్రీలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులను అందచేశారు. కాగా బుజబుజ నెల్లూరులో పారిశుధ్య పనులు పరిశీలించారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424





॥ చిరుత సంధ్యావందనం ॥

తిరుమల శిలాతోరణం వద్ద గుట్టమీద గురువారం సాయంత్రం ఓ చిరుతపులి కాసేపు అస్తమిస్తున్న సూర్యుడిని చూస్తూ నింపాదిగా కూర్చుంది. లేచి ఒళ్లు విరుచుకుని కొండ దిగి వెళ్లిపోయింది. ఈ దృశ్యాన్ని యాత్రికులు తమ మొబైల్ కెమెరాల్లో చిత్రించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఈ బెంజ్.. ఏ పుష్పాది?

ఇదో బెంజ్ కారు. తిరుపతి కపిలతీర్థం దగ్గరున్న టాస్క్‌ఫోర్స్ కార్యాలయం ప్రాంగణంలో పదేళ్లుగా ఇలా పడివుంది. శేషాచలంను కొల్లగొట్టే ఎర్రదొంగలు స్మగ్లింగ్‌కి వాడిన బెంజ్ ఇది. 2014లో 334 కేజీల బరువు ఉన్న 24 ఎర్రచందనం దుంగలు తరలిస్తుండగా ఇన్నోవా, హోండాలతో పాటూ ఈ బెంజ్ కారును తిరుచానూరు పోలీసులు లక్ష్మీ చెరువు వద్ద పట్టుకున్నారు. అంతే అప్పటి నుంచీ కోట్ల ఖరీదు చేసే ఈ దర్జా బెంజ్ కారు దీనంగా ఇలా పడివుంది. ఇదొక్కటే కాదు ఎర్ర దుంగలతో దొరికిన దాదాపు వెయ్యి కార్లు దశాబ్దాలుగా తుప్పు పట్టిపోయి మన దర్యాప్తు వ్యవస్థ తీరును వెక్కిరిస్తున్నట్టుగా ముళ్ల పొదల్లో పడివున్నాయి.

-6లో

నేడే బ్రహ్మాండమైన విడుదల



ఆనంద్ స్క్రీన్-5	- కర్నూలు
భారత్	- కర్నూలు
ఎఆర్ మిని	- నంద్యాల
రాజశ్రీ	- ఆదోని
గంగ	- అనంతపురం
తరంగిణి	- అనంతపురం
తాహర్	- కడప
చాంద్	- ప్రొద్దుటూరు
చాణక్య	- చిత్తూరు
సాయిచిత్ర	- మదనపల్లి

CONTACT : 9550740061

వైసీపీకి 'డిప్యూటీ' పోటు

- భూమన ముఖ్య విధేయుడు దూరం
- కార్పొరేటర్లను కాపాడుకోవడానికి తంటాలు
- తమిళనాడు రిసార్ట్స్‌లో వైసీపీ నేతల రెస్ట్

తిరుపతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక స్థానిక వైసీపీకి తలపోటుగా మారింది. ఆ పార్టీ నుంచి 42వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్‌రెడ్డిని డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా ప్రకటించడంతో భూమన విధేయుల్లో అసమ్మతి సెగ రేగింది. సుదీర్ఘకాలం పాటు భూమన కరుణాకర్ రెడ్డి వెంట నడిచిన కార్పొరేటర్ ఎస్కే బాబు తీవ్రమనస్తాపం చెందారు. రెండు రోజుల కిందట భూమన ఇంట్లో జరిగిన కార్పొరేటర్ల సమావేశానికి గైర్హాజరయ్యారు. దీంతో స్థానిక నాయకత్వం ఆయన్ను తీవ్రంగా తూలనాడినట్టుగా తెలుస్తోంది. దీంతో ఆయన కాస్త రాజకీయ వైరాగ్యానికి గురయ్యారు. మనిషి జీవితం పేపరులాంటిదని ఎంత నలిగితే అంత నిలబడుతుందన్న సందేశంతో సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆయన ఎవరిని ఉద్దేశించి అన్నారో, ఎందుకు అనాల్సివచ్చిందో రాజకీయవర్గాలకు తెలిసినప్పటికీ, సాధారణ ప్రజానీకం కూడా చర్చించుకోవడం మొదలుపెట్టారు. గురువారం మరో వీడియో తన సోషల్ మీడియాలో విడుదల చేసి ఇక వైసీపీకి గుడ్‌బై అన్నట్టుగా నర్మగర్భంగా తేల్చేశారు. ఇంతకాలం నమ్మినబంటుగా ఉన్న వ్యక్తి పరిస్థితే ఇలా ఉంటే ఇక మిగతావారి పరిస్థితి ఎలావుంటుందోనన్న ఆందోళనలో కొందరు కార్పొరేటర్లు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో కూటమి పార్టీ నాయకులు ఎస్కే బాబుతో టచ్‌లోకి వెళ్లినట్టు తెలుస్తోంది. డిప్యూటీ మేయర్ ఎన్నికలో ఎస్కే ఎటు వైపు ఉంటారన్న ప్రచారం జరుగుతోంది.

మహాబలిపురంలో వైసీపీ క్యాంప్

సొంత పార్టీ కార్పొరేటర్లను కాపాడుకునేందుకు వైసీపీ నానా తంటాలు పడుతోంది. స్థానిక నాయకత్వం డిప్యూటీ మేయర్ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. క్యాంపు రాజకీయాల్లో ఆరితేరినవారిని రంగంలోకి దింపింది. గురువారం ఉదయం సుమారు 20 మంది కార్పొరేటర్లు మహాబలిపురం పయనమైనట్టుగా తెలుస్తోంది. తొలుత పాండిచ్చేరి, గోవా, బెంగళూరు.. ఇలా పలు ఊర్ల పేర్లు చెప్పి చివరికి మహాబలిపురం సమీపంలోని ఓ రిసార్ట్‌లో దిగినట్టు సమాచారం. క్యాంపు ఖర్చులన్నింటినీ డిప్యూటీ మేయర్ అభ్యర్థి శేఖర్‌రెడ్డి భుజాలపై స్థానిక నాయకత్వం పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే.. అధికార పార్టీని ధిక్కరించి ఏడాది గడువున్న డిప్యూటీ మేయర్ పదవి తనకు అవసరమా? అన్న సందిగ్ధంలో కూడా అభ్యర్థి ఉన్నట్టు సమాచారం. మరోవైపు క్యాంపునకు వెళ్లినవారి కుటుంబ సభ్యులు కొందరు కూటమి నేతలతో టచ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. మున్ముందు డిప్యూటీ మేయర్ ఎన్నిక పరిణామాలు ఎలా మారతాయో కానీ ప్రస్తుతానికి వైసీపీ క్యాంపు రాజకీయ వ్యవహారంతో వాతావరణం వేడెక్కింది.

బెదిరిస్తే ఊరుకోం: భూమన

ప్రజాస్వామ్యంగా ఎన్నిక జరగాలని, తమ కార్పొరేటర్లను లొంగదీసుకోవాలని చూస్తే పోరాటాలకు సిద్ధపడతామంటూ భూమన కరుణాకర్‌రెడ్డి గురువారం ఓ సెల్ఫీ వీడియో విడుదలచేశారు. రాష్ట్ర వైసీపీ మొత్తం తిరుపతిలో తిష్ఠ వేస్తుందన్నారు. కార్పొరేటర్లను బెదిరించడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. - అయితే, గత మున్సిపల్ ఎన్నికలు ఎంతటి ప్రజాస్వామ్యయుతంగా జరిగాయో ఇప్పుడూ అంతే పద్ధతిగా ఉంటాయని 'నీవు నేర్పిన విద్యే నీరజాక్ష' అంటూ పలువురు నెటిజన్లు వ్యాఖ్యానాలు చేయడం గమనార్హం.

SRI VENKATESWARA UNIVERSITY :: TIRUPATI

e - Procurement short Tender Notice (7 Days)

Tender No. 21/ UEO - HD / SVU / TPT / 2024-25, Dt: 30-01-2025. For details log on to https://www.tender.apeprocurement.gov.in and Tender Schedule Down-load Ending and Bid submission closing Date: 06-02-2025 at 09.30 A.M & 10.30 A.M from Nit No.167 to170.

Sd/ M. Bhupathi Naidu
REGISTRAR, S.V. University, Tirupati



సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్

CUB TRUST AND EXCELLENCE SINCE 1904

క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001. ఇ-మెయిల్ ఐడి : crmd@cityunionbank.in
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) & (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, పరిపాలనా కార్యాలయం నం.24-బి, గాంధీనగర్, కుంబకోణం-612 001** మరియు శాఖ కార్యాలయంలో ఒకటి **డోర్ నం.29-36-18, మల్లాదివారి వీధి, మ్యూజియం రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ, కృష్ణా-520002, విజయవాడ-గవర్నర్‌పేట శాఖ** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సదరు ప్రకటన స్వీకరణ తేది నుండి **60 రోజుల్లోగా** ప్రకటనలో తెలిపిన మొత్తం **రూ.22,27,783/- (రూపాయలు ఇరవై రెండు లక్షల ఇరవై ఏడు వేల ఏడు వందల ఎనభై మూడు మాత్రమే)** లను నెలవారీ వాయిదాలతో **17.10.2024** నుండి దానిపై వడ్డీతో కలిపి తిరిగి చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు నం..1) **M/s.Eyedea అడ్వర్టైజింగ్ సర్వీసెస్, నం.103, గ్రౌండ్ ఫ్లోర్, డి.నం.26-7-16, కృష్ణాసదన్, వైజయంతి పిక్చర్స్ ఎదురుగా, గరికపాటి వారి వీధి, గాంధీనగర్, విజయవాడ-520003. నం. 2) శ్రీ శ్యామ్ సురేష్ అల్లంపూడి, తండ్రి శివశంకర్ అల్లంపూడి, డి.నం.41-1/2-11, పుష్పలవారి వీధి, కృష్ణలంక, విజయవాడ - 520013. నం.3) శ్రీమతి అల్లంపూడి జ్యోతి లక్ష్మి, భర్త శ్రీ శ్యామ్ సురేష్ అల్లంపూడి, డి.నం. 41-1/2-11, పుష్పలవారి వీధి, కృష్ణలంక, విజయవాడ -520013. నం.4) శ్రీమతి మన్యం నాగభూషణ, భర్త మన్యం వరదయ్య, డి.నం.19-9-28/7ఎ, లక్ష్మీపురం, చిత్తూరు జిల్లా, తిరుపతి -517501** లను తిరిగి చెల్లించమని కోరుతూ **22.10.2024** తేదీగల డిమాండ్ ప్రకటన జారీ చేశారు.

పైన తెలిపిన చట్టబద్ధమైన ప్రకటన స్వీకరించిన మీదట కూడా సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో పైన పేర్లు కలిగిన రుణగ్రహీతలు విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇందులో వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు 27 జనవరి 2025న స్వాధీనం చేసుకున్నారని ఇందుమూలంగా పైన పేర్లు కలిగిన రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని ముఖ్యంగా పైన పేర్లు కలిగిన రుణగ్రహీతలను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారాలైనా మొత్తం **రూ.23,09,780/- (రూపాయలు ఇరవై మూడు లక్షల తొమ్మిదివేల ఏడు వందల ఎనభై మాత్రమే)** మరియు పూర్తి బకాయిలు చెల్లించునంతవరకు **20.01.2025** నుండి దానిపై వడ్డీని సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు చెల్లించుటకు లోబడియుంటాయి.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు సమయం ఉన్నందున చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలు కోరబడుతున్నారు.

మా బ్యాంకుకు తనఖా పెట్టబడిన స్థిరాస్తి

షెడ్యూల్-ఎ :(శ్రీమతి మన్యం నాగభూషణ, భర్త మన్యం వరదయ్యకు చెందిన ఆస్తి)
చిత్తూరు జిల్లా శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ జిల్లా, తిరుపతి ఉపజిల్లా, తిరుపతి అర్బన్ మండలం, తిరుపతి గ్రామ పరిధులు, తిరుపతి పట్నం, సర్వే నం.లు.51/6డి మరియు 51/6ఇ లో భూమి, తిరుపతి నగరపాలక సంస్థ, మున్సిపల్ వార్డు నం.19, తిరుచానూర్, లక్ష్మీపురం నివాసిత ప్రాంతం అన్ని అనుభోగ హక్కులు మరియు అన్ని అనుబంధాలతో భవిష్యత్తులో దానిపై జరుపబోవు సూపర్ స్ట్రక్చర్ మరియు ప్రస్తుతమున్న ఇం.నం.19-9-28/7ఎ గల ఆర్‌సీసీ రూఫ్ కలిగిన భవనంతో 740 చ.అడుగులు లేదా 82.22 చ.గజాల విస్తీర్ణ ప్రస్తుత స్థలం యావత్తు. **సరిహద్దులు:** తూర్పు: రోడ్, పశ్చిమం: టి. పురుషోత్తంరెడ్డికి గల డి.నం.19-9-28/7 గల ఇల్లు, ఉత్తరం:4 అడుగుల వెడల్పు లేన్, దక్షిణం: కె. ధనుంజయ నాయుడుకు గల స్థలం.

ప్రదేశం: **తిరుపతి**, తేది: **27.01.2025** — **అధీకృత అధికారి**

సమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు - 612001, CIN - L65110TN1904PLC001287
టెలిఫోన్ నం: 0435-2402322, ఫ్యాక్స్: 0435-2431746, వెబ్‌సైట్: www.cityunionbank.com

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్

CUB TRUST AND EXCELLENCE SINCE 1904

క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001. ఇ-మెయిల్ ఐడి : crmd@cityunionbank.in
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తులు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) & (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, పరిపాలనా కార్యాలయం నం.24-బి, గాంధీనగర్, కుంబకోణం-612 001** మరియు శాఖ కార్యాలయంలో ఒకటి బైల్ ఖన్నా వీధి, నాయుడు బిల్డింగ్, చిత్తూరు - **517001, చిత్తూరు శాఖ** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సదరు ప్రకటన స్వీకరణ తేది నుండి **60 రోజుల్లోగా** ప్రకటనలో తెలిపిన మొత్తం **రూ.87,88,744/-(రూపాయలు ఎనభై ఏడు లక్షల ఎనభై ఎనిమిది వేల ఏడు వందల నలభై నాలుగు మాత్రమే)** లను నెలవారీ వాయిదాలతో **06.11.2024** నుండి దానిపై వడ్డీతో కలిపి తిరిగి చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు నం. 1.) మెస్సర్స్ కె.ఎస్. పాండురంగయ్య చెట్టి జ్యూవెల్లర్స్, నం. 12-125, బజారు వీధి, చిత్తూరు టౌన్, చిత్తూరు - **517001, నం. 2) శ్రీ కె.ఆర్. శ్రీనివాస్ కుమార్, తండ్రి కె.రాజా చెట్టి, నం. 2-1172, లక్ష్మీనగర్ కాలనీ రోడ్, బండపల్లి, చిత్తూరు, ఆంధ్రప్రదేశ్ - 517001, నం. 3) శ్రీమతి కె.ఎస్.బిరావలి, భర్త శ్రీ కె.ఆర్. శ్రీనివాస్ కుమార్, నం. 2-1172, లక్ష్మీనగర్ కాలనీ రోడ్, బండపల్లి, చిత్తూరు, ఆంధ్రప్రదేశ్ - 517001** లను తిరిగి చెల్లించమని కోరుతూ **11.11.2024** తేదీగల డిమాండ్ ప్రకటన జారీ చేశారు.

పైన తెలిపిన చట్టబద్ధమైన ప్రకటన స్వీకరించిన మీదట కూడా సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో పైన పేర్లు కలిగిన రుణగ్రహీతలు విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇందులో వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు 27 జనవరి 2025న స్వాధీనం చేసుకున్నారని ఇందుమూలంగా పైన పేర్లు కలిగిన రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని ముఖ్యంగా పైన పేర్లు కలిగిన రుణగ్రహీతలను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారాలైనా మొత్తం **రూ.89,31,521/- (రూపాయలు ఎనభై తొమ్మిది లక్షల ముప్పై ఒక్క వేల ఐదు వందల ఇరవై ఒకటి మాత్రమే)** మరియు పూర్తి బకాయిలు చెల్లించునంతవరకు **17.01.2025** నుండి దానిపై వడ్డీని సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు చెల్లించుటకు లోబడియుంటాయి.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు సమయం ఉన్నందున చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలు కోరబడుతున్నారు.

మా బ్యాంకుకు తనఖా పెట్టబడిన స్థిరాస్తులు

షెడ్యూల్-ఎ :(శ్రీ కె.ఆర్. శ్రీనివాస్ కుమార్, తండ్రి కె. రాజా చెట్టికు చెందిన ఆస్తి)
ఆంధ్రప్రదేశ్, చిత్తూరు జిల్లా, చిత్తూరు టౌన్, బజార్ వీధి, చిత్తూరు కార్పొరేషన్ బ్లాక్ నం.1, చిత్తూరు మండలం, చిత్తూరు జిల్లా పరిషత్, చిత్తూరు సబ్ జిల్లా, రెవెన్యూ వార్డు నం.12, బ్లాక్ నం.1, డోర్ నం.12-124 &125, ఖాళీ ఇంటి స్థలం (పడగొట్టిన పాత భవనం)లో కొత్తగా నిర్మిస్తున్న ఆర్‌సీసీ రూఫ్ కలిగిన భవనం జీ+2లో సదుపాయాలు మరియు భూమి, నిర్మించిన మరియు నిర్మించబోయే ఆస్తి యావత్తు. **సరిహద్దులు:** ఉత్తరం: బజారు వీధి, దక్షిణం: సివేంజర్స్ లేన్, తూర్పు: నంద్యాల శ్రీనివాసులు చెట్టి భవనం, పశ్చిమం: శ్రీపురం వెంకటరామ చెట్టి సత్రం భవనం. **కొలతలు:** తూర్పు-పశ్చిమం: 15½ అడుగులు లేదా 4.724 మీటర్లు, ఉత్తరం - దక్షిణం: 115 అడుగులు లేదా 35.052 మీటర్లు ,మొత్తం విస్తీర్ణం:1782.5 చ.అడుగులు లేదా 198.5 చ.గజాలు.

ప్రదేశం: **చిత్తూరు**, తేది: **27.01.2025** — **అధీకృత అధికారి**

సమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు - 612001, CIN - L65110TN1904PLC001287
టెలిఫోన్ నం: 0435-2402322, ఫ్యాక్స్: 0435-2431746, వెబ్‌సైట్: www.cityunionbank.com

ఒక ఆలోచన
బస్సునే మార్చేసింది!



గ్రామాలకు తిరుగుతూ ప్రయాణీకులకు సేవలందిస్తున్న కన్వర్షన్ పల్లెవెలుగు బస్సు

- స్క్రాప్ నుంచి పల్లె వెలుగుగా..
- తిరుపతిలో ఆర్టీసీ బస్సుల 'బాడీ కన్వర్షన్'

ఒక చిన్న ఆలోచన.. స్క్రాప్‌కు వెళ్లాల్సిన బస్సులను 'పల్లె వెలుగు' సర్వీసులుగా మార్చింది. బస్సుల కొరతను ఎదుర్కొనేందుకు ఉపయోగపడింది. గతేడాది మొదలు పెట్టిన ఆర్టీసీ బస్సుల 'బాడీ కన్వర్షన్' ప్రక్రియ.. తిరుపతి డిపోలోని ఎనిమిది బస్సుల రూపాలను పూర్తిగా మార్చేసింది. - తిరుపతి(ఆర్టీసీ), ఆంధ్రజ్యోతి



స్క్రాప్ నుంచి పల్లెవెలుగుగా మారుతున్న బస్సు

గతేడాది జనవరిలో 15 ఏళ్లు దాటిన కొన్ని సూపర్ లగ్జరీ బస్సులను స్క్రాప్‌కు పంపేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో కొన్ని గ్రామాలకు నడిపేందుకు పల్లెవెలుగు బస్సుల కొరత ఏర్పడింది. కొత్త బస్సులు వచ్చే అవకాశాలు కనబడలేదు. పైగా స్క్రాబ్‌కు పంపాలని పక్కన పెట్టిన బస్సులలో కొన్ని విడిభాగాలు బాగున్నాయి. దీంతో అప్పటి డీపీటీవోగా ఉన్న చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీఎంఈగా ఉన్న జి.నరసింహులు సమాలోచనలు జరిపి.. తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ, గ్యారేజీ సిబ్బందితో చర్చించారు. దాని ఫలితమే 'బస్సు బాడీ కన్వర్షన్'. వీరు విజయవాడ ప్రధాన కార్యాలయానికి పంపిన ప్రతిపాదనలకు అక్కడి అధికారులు అంగీకరించి తిరుపతితో పాటు ఇతర జిల్లాలకూ అనుమతులిచ్చారు. బస్సు బాడీ కన్వర్షన్ ప్రక్రియను అనుసరించాలని ఆదేశించారు. తిరుపతిలో తొలుతగా ఓ సూపర్ లగ్జరీ బస్సుపై ప్రయోగాత్మకంగా పనులు మొదలుపెట్టారు. ఉపయోగ పరికరాలు మినహా పాడైనవాటిని తొలగించి స్క్రాప్‌కు వేశారు. రేకులు, సీట్లు, పిల్లర్స్ రంగులు, టైర్లు, లైటింగ్, బ్రేకులు, గేర్‌బాక్సు, ఎయిర్‌ఫిల్టర్, ఇతర సాంకేతిక పరమైన వాటిని కొత్తగా అమర్చారు. వీటికి సుమారు రూ.1.5 లక్షలు ఖర్చు పెట్టి.. 52 సీట్ల సామర్థ్యంతో పల్లె వెలుగు బస్సుగా మార్చారు. కొన్ని రోజుల పాటు డిపోలోనే నడిపి పరిశీలించారు. తర్వాత సిబ్బందిని ఎక్కించుకొని తిప్పారు. ఎలాంటి సమస్య ఎదురు కాకపోవడంతో అనుభవమున్న డ్రైవర్ ధనాంజనేయులను ఎంపికచేసి తిరుపతి నుంచి పళ్లిపట్టుకు నడిపారు. ఈ ప్రయోగం విజయవంతమైంది. దాంతో కాలం చెల్లిన బస్సులను అవసరమైన సంఖ్యలో పల్లె వెలుగు బస్సులుగా మార్చుకోవాలని పూర్తిస్థాయి అనుమతులు వచ్చాయి.

ఏడాదిలో 8 బస్సుల బాడీ కన్వర్షన్

2024 జనవరిలో ప్రారంభమైన ఈ ప్రక్రియలో మొత్తం 8 బస్సులను పల్లెవెలుగు బస్సులుగా మార్చారు. రాష్ట్రంలోని 128 డిపోలలో అత్యధిక సంఖ్యలో బస్సు బాడీ కన్వర్షన్ జరిగింది కూ తిరుపతి డిపోలోనే. ఈ ప్రక్రియలో ప్రధాన పాత్ర పోషించిన కోచ్‌బిల్డర్స్ అండ్ వెల్డర్స్ రాజ్‌గోపాల్, సుబ్బరాజు, అంకయ్య, గురవయ్య, గోపికి ప్రశంసా పత్రాలు అందించారు. కొత్తగా నాలుగు అల్ట్రాడీలెక్స్ బస్సులు రాగానే.. పాతవాటిని ఇదే తరహాలో కన్వర్షన్ చేయనున్నారు.



పల్లెవెలుగు బస్సులుగా మార్చేందుకు రెడిగా ఉన్న స్క్రాప్ బస్సులు

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

- రథసప్తమి ఏర్పాట్లే ప్రధాన అజెండా

తిరుమల, జనవరి30(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి శుక్రవారం సమావేశం కానుంది. అన్నమయ్య భవనంలో టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో ఉదయం 10గంటలకు జరిగే సమావేశంలో ప్రధానంగా రథసప్తమి ఏర్పాట్లపైనే చర్చించనున్నారు. తిరుపతి తొక్కిసలాట ఘటన నేపథ్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా తీసుకోవల్సిన జాగ్రత్తలు, దర్శన విధానాలు, మాడవీధుల గ్యాలరీల్లోకి భక్తుల ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, ప్రధాన సౌకర్యాలపై చర్చించనున్నారు. ఫిబ్రవరి 4న జరిగే రథసప్తమికి దాదాపు 2 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా.

ఆంధ్రజ్యోతి
కార్ అండ్ బైక్ రేస్



జనవరి నెల కూపన్ నంబర్ - 3

పాఠకుని పూర్తి పేరు	:	....
డోర్ నెంబరు	:	....
వీధి పేరు	:	....
గ్రామం / పట్టణం	:	....
మండలం	:	....
జిల్లా	:	....
పోస్టల్ పిన్‌కోడ్	:	....
ఫోన్ నంబర్	:	....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది జనవరి నెల మూడవ కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి రెండు నెలలు అయిన తర్వాత మొత్తం 6 కూపన్లను రెండు సెట్లుగా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.

నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.
* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.



కూపన్లు పంపవలసిన చిరునామా

ఆంధ్రజ్యోతి బిల్డింగ్, నెం.91, ఉడ్ కాంప్లెక్స్,
అయ్యప్పగుడి సెంటర్, వేదాయపాళెం, నెల్లూరు-524004.
సెల్: 99854 11421, 99854 11424

ఇస్రో శాస్త్రవేత్తలకు 'వంద'నం



రాకెట్ నమూనాలో కొందరు.. 100 అంకె ఆకృతిలో మరికొందరు. ఇలా విద్యార్థులు కూర్చుని ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. షార్ నుంచి బుధవారం వందో రాకెట్ ప్రయోగం విజయవంతమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం గూడూరులోని గాయత్రి ఇంగ్లీషుమీడియం పాఠశాలలో విద్యార్థులు రాకెట్ నమూనాలో మానవహారాన్ని ఏర్పాటు చేసి శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, శ్రీహరి, సోనియా, రఫీ, రాఘవయ్య, సుప్రజ, మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

- గూడూరు, ఆంధ్రజ్యోతి

ట్రయల్ రన్



రథసప్తమి సందర్భంగా తిరుమలలో ఫిబ్రవరి 4న ఉదయం నుంచి రాత్రి వరకు ఏడు వాహనాలపై మలయప్ప మాడవీధుల్లో ఊరేగనున్నారు. ఈక్రమంలో భారీ పరిమాణంలో కలిగిన సర్వభూపాల, సూర్యప్రభ వాహనాల పటిష్ఠతను పరిశీలించేందుకు టీటీడీ అధికారులు గురువారం ఉదయం ట్రయల్ రన్ నిర్వహించారు. అధిక బరువుండే ఈ వాహనాల ఊరేగింపులో వాహన బేరర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశీలించారు. వాహన మండపం నుంచి ఆలయం వరకు.. అక్కడ్నుంచి తిరిగి వాహనమండపం వరకు ఈ ట్రయల్ రన్ నిర్వహించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 7 గంటలు



తిరుమలలో వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.14 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,710

తలనీలాలు సమర్పించినవారు: 15,635



తిరుపతి కపిలతీర్థం వద్ద టాస్క్‌ఫోర్సు ఆఫీసు ఆవరణలో శిథిలమవుతున్న వాహనాలు

వామ్మో... ఇవన్నీ పుష్పా కార్లు

- ఎర్రచందనం స్మగ్లింగ్‌లో పట్టుబడి తుక్కుగా మారుతున్న వాహనాలు
- దర్యాప్తులో జాప్యంతో రూ.కోట్ల నష్టం

తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఈ కార్లు వేలం వేస్తామహో...! అని తిరుపతి డివిజన్ అటవీశాఖ ప్రకటించింది. ఇండియాలో షోరూములున్న అన్ని కార్లూ కపిలతీర్థం దగ్గరున్న టాస్క్‌ఫోర్స్ ఆఫీసు ఆవరణలోని తుప్పల్లో ఇలా ఉన్నాయి. కోరిన మోడల్.. కారు చవగ్గా వేలంలో ఎగరేసుకుపోవచ్చని ఆశ పడితే మాత్రం హుళుక్కే! వీటిలో ఇంజన్లు ఉన్నాయో లేదో తెలీదు. ఉన్నా ఏ పార్టులు మిగిలివున్నాయో చెప్పలేం. విత్తనాలు పడి, మొక్కలు మొలిచి, మానులై పెరిగి, తీగలు అల్లుకుని ఇదిగో ఇలా ఉన్న ఈ కార్లను కొని రోడ్ల మీద తిప్పడం సాధ్యమేనా? తుక్కుకు తప్ప పనికిరాని తుప్పుగా మారిన ఈ కార్లను కొనే సాహసం పాత సామాన్లు కొనేవారు తప్ప ఇంకెవరూ చేయడం లేదు. అందుకే 2024 సెప్టెంబర్‌లో 40 వాహనాలను వేలం వేయగా కేవలం రూ.18.59లక్షలు మాత్రమే వచ్చింది. ఫిబ్రవరి 5న 153 వాహనాలు వేలం వేసేందుకు అటవీ శాఖ సిద్ధపడింది. ఇంకా 800కు పైగా వాహనాలు కనీసం తుక్కుగా కూడా పనికిరాని విధంగా పడివుంటాయన్నమాట.

ఎందుకిలా?

దర్యాప్తులో అసాధారణ జాప్యం వల్ల ఎర్రచందనం స్మగ్లింగ్‌లో పట్టుబడ్డ వాహనాలు ఇలా పనికిరానివిగా మిగిలిపోతున్నాయి. పట్టుబడ్డ వాహనాల యజమానులను గుర్తించడమే పెద్ద సమస్య. స్మగ్లింగ్‌కి వాడే వాహనాలకు సాధారణంగా అసలు నెంబర్లు ఉండవు. చాసిస్ నెంబర్లను కూడా మార్చేస్తుంటారు. దీంతో వీటి అసలు యజమానులు ఎవరో తేలలేదు అని నిర్ధారించేసరికే ఏళ్లకు ఏళ్లు పడుతోంది. అప్పటికే ఇవి మట్టిలో కూరుకుపోయి, చెట్ల మధ్య మునిగిపోయి ఇలా మారుతున్నాయి. ఆ తర్వాత వీటి వేలాని అనుమతి పొంది, విలువ కట్టాల్సిందిగా ఆర్టీవో కార్యాలయాన్ని కోరుతారు. వారు ధరలు నిర్ణయించాక వేలం ప్రకటిస్తారు. తీరా వేలం వేసే నాటికి ఇనుముగా తప్ప ఇంక దేనికీ పనికిరాకుండా పోతున్నాయి. ఇట్లా లారీలు, వ్యాన్‌లు, ఆటోలు, కార్లు కుప్పలు తెప్పలుగా పడివుంటున్నాయి. భాకరాపేట ఘాట్‌లో అయితే ఈ వాహనాలను మట్టిలో కలిపేస్తూ ఒక అడవే పెరిగింది.

రూ.30 కోట్ల ఆదాయం మటాష్!

దర్యాప్తులో వేగం పెంచి, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో వ్యవహరిస్తే పట్టుబడిని ఏడాదిలోనే ఈ వాహనాలను వేలం వేసే అవకాశం ఉంటుంది. ఇలా చేయగలిగితే ప్రభుత్వానికి భారీ ఆదాయం కూడా లభిస్తుంది. తిరుపతి డివిజన్ పరిధిలో 2000 నుంచి గతేడాది చివరి వరకూ స్వాధీనం చేసుకున్నవే వెయ్యి వాహనాలదాకా ఉన్నాయి. పట్టుబడిన ఏడాదిలోగా వేలం వేయగలిగితే సగటున ఒక వాహనం రెండు నుంచి మూడు లక్షలకు అమ్ముడయ్యే అవకాశం ఉంటుంది. అంటే దాదాపు 20 నుంచి 30 కోట్ల రూపాయల ఆదాయం లభించేది.



భాకరాపేట ఘాట్ పక్కన తుక్కుగా మారిన వాహనాలు

దర్యాప్తు తుప్పు వదిలితే కోట్ల ఆదాయం

- స్వాధీనం చేసుకున్న వాహనాలను ఎక్కడపడితే అక్కడ కాక భద్రతగల ప్రత్యేక ప్రాంతాల్లో పార్క్ చేయాలి.
- పట్టుబడిన వాహనాల ప్రతి పార్ట్‌నూ వీడియో రికార్డు చేయచ్చు.
- అసలు యజమానులను గుర్తించే ప్రక్రియకు ఏడాదికి మించకుండా గడువు
- చార్జ్‌షీట్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి.
- ప్రత్యేక కోర్టుల ద్వారా కేసుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలి.



చేతివాటమూ ఘనమే

పట్టుబడిన వాహనాల్లోంచి ముఖ్య భాగాలు మాయమైపోతుంటాయి.ముందుగా మాయమ య్యేది బ్యాటరీలు. వాటి స్థానంలో పనికిరాని బ్యాటరీలు ప్రత్యక్షమవుతాయి. కొన్ని వాహనా లకైతే ఏకంగా ఇంజన్లే మాయమైపోతుం టాయి. మానిటర్లూ, జీపీఎస్‌లూ వంటివి అయితే అసలు మిగలవు. ఎలాగూ ఇప్పట్లో తేలే వ్యవహారం కాదు కాబట్టి ఇంటి దొంగలే చేతివాటం ప్రదర్శిస్తుంటారని తెలుస్తోంది.

5న 153 వాహనాల వేలం

తిరుపతి డివిజన్ పరిధిలో పట్టుబడిన 153 వాహనాలను ఫిబ్రవరి 5న తేదీన కపిలతీర్థం వద్ద జిల్లా అటవీ అటవీ శాఖ కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నారు. ఆ తర్వాత మరో 200 వాహనాలకు కూడా బహిరంగ వేలం వేయనున్నట్లు సమాచారం.



ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



తిరుమల, జనవరి30 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్టుకు గురువారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. తిరుపతికి చెందిన బ్లిస్ హోటల్స్ గ్రూప్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి దంపతులు విరాళం చెక్‌ను అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. ఈకార్యక్రమంలో బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి కూడా ఉన్నారు.

శ్రీకాళహస్తి రూరల్ సీఐ వాహనం బోల్తా

- సీఐతో పాటు డ్రైవర్‌కు తీవ్రగాయాలు



తిరుపతి(నేరవిభాగం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఉప్పరపల్లి సమీపంలో శ్రీకాళహస్తి రూరల్ సీఐ వాహనం గురువారం రోడ్డుకు ఎడమ వైపున బోల్తా పడింది. రోడ్డుపై వస్తున్న ఆవులను తప్పించబోయే క్రమంలో అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. సీఐతో పాటు డ్రైవర్‌కూ తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఎస్పీ కార్యాలయంలో అధికారిక పనుల నిమిత్తం శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్, సిబ్బంది గురువారం ఉదయం తిరుపతికి వచ్చారు. ఇక్కడ పనులు ముగించుకుని తిరిగి వెళుతుండగా ఒక్కసారిగా ఆవులు రోడ్డుపైకి పరుగెత్తుకుంటూ వచ్చాయి. ఈ ఆవులను తప్పించబోయే క్రమంలో వాహనం రోడ్డుకు ఎడమవైపున పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. వాహనంలోని రూరల్ సీఐ రవినాయక్‌తో పాటు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

నేడు పెళ్లి జరగాల్సి ఉండగా..!

- పది రోజుల కిందట అదృశ్యమైన విద్యార్థిని
- పంబలేరువాగులో లభ్యమైన మృతదేహం



లేహానిస్సి (ఫైల్ ఫొటో)

గూడూరు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అంతా అనుకున్నట్లు జరిగుంటే.. ఆ ఇంట పెళ్లి బాజాలు మోగాల్సింది. శుక్రవారం ఉదయం ఆమె పెళ్లి కూతురుగా పీటలమీదకు ఎక్కాల్సి ఉంది. కానీ.. ఆ ఇంట విషాదం నెలకొంది. పది రోజుల కిందట అదృశ్యమైన ఆ విద్యార్థిని.. పంబలేరు వాగులో గురువారం మృతదేహంగా తేలింది. ఈ విషాద ఘటన గూడూరు మండలం పోటుపాళెం సమీపంలో చోటుచేసుకుంది. గూడూరు రూరల్ పోలీసులు తెలిపిన ప్రకారం.. సూళ్లూరుపేటలోని రాఘవయ్యపేటకు చెందిన శామ్యూల్ జయకుమార్, రమాదేవి దంపతుల కుమార్తె లేహానిస్సి(19) గూడూరులోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ రెండో సంవత్సరం చదువుతోంది. ఈమెకు సమీప బంధువుతో ఈ నెల 31వ తేదీ (శుక్రవారం) పెళ్లి నిశ్చయించారు. ఈ క్రమంలో ఈనెల 20వ తేదీన కళాశాలకు వెళ్లిన లేహానిస్సి ఇంటికి రాలేదు. పలుచోట్ల వెదికిన కుటుంబసభ్యులు.. ఆమె కనిపించడం లేదని ఈనెల 21న సూళ్లూరుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గూడూరు మండలం పోటుపాళెం సమీపంలోని పంబలేరువాగులో గురువారం లేహానిస్సి మృతదేహం లభ్యమైంది. శుక్రవారం ఉదయం పెళ్లి జరగాల్సి ఉండగా ఆమె మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విద్యార్థిని మృతికి గల కారణాలను పోలీసులు విచారిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించి రూరల్ ఇన్‌చార్జి ఎస్‌ఐ తిరుపతయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూడుపాముల రవాణా కేసులో ముగ్గురికి ఏడాది జైలు శిక్ష

- 15 ఏళ్లనాటి కేసులో తీర్పు

సత్యవేడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పూడు పాముల అక్రమ రవాణా కేసులో ముగ్గురు నిందితులకు ఏడాది జైలుశిక్ష విధిస్తూ సత్యవేడు జూనియర్ సివిల్ కోర్టు తీర్పు వెలువరించింది. వివరాలిలా ఉన్నాయి. 2009 జూలై 22వ తేదీన సత్యవేడు మండలం పేరడం గ్రామానికి చెందిన మేకల లక్ష్మయ్య, తమిళనాడు రాష్ట్రం ఊత్తుకోట్టైకు చెందిన రజిని, రాధ.. సత్యవేడు అటవీప్రాంతం నుంచి నాలుగు పూడు పాములు పట్టుకుని అక్రమ రవాణా చేస్తుండగా అప్పటి ఎస్‌ఐ బీవీ శ్రీనివాసులు పట్టుకున్నారు. పాముల సహా వీరిని అటవీశాఖకు అప్పగించారు. 2022లో అప్పటి ఎఫ్‌ఆర్‌వో జయప్రసాదరావు అటవీ హక్కులు, వన్యప్రాణి విభాగం చట్టం ప్రకారం చార్జిషీటు దాఖలు చేయగా, ఎఫ్‌బీవో వేణుగోపాల్ ఇందుకు సంబంధించిన సాక్షులను ప్రవేశ పెట్టారు. నేరం నిరూపణ కావడంతో ముగ్గురు నిందితులకు ఏడాది జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ ఇన్‌చార్జి న్యాయమూర్తి గోపాలకృష్ణ తీర్పును వెలువరించారు.

ఇద్దరు 'ఎర్ర' దొంగలకు ఐదేళ్ల జైలు

- రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ ఎర్రచందనం అదనపు జిల్లా జడ్జి నరసింహమూర్తి గురువారం తీర్పు చెప్పారు. దీనికి సంబంధించి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. ఎనిమిదేళ్ల క్రితం తమిళనాడుకు చెందిన కె.మణి, పి.దొరస్వామి ఎర్రచందనం అక్రమంగా తరలిస్తూ నాగపట్ల బీట్ పరిధిలోని చామల రేంజ్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. దీనిపై విచారించి కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. దీంతో ప్రస్తుతం ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఎస్పీ శ్రీనివాస్ కేసులో ఎప్పటికప్పుడు ప్రగతి నివేదికలపై సమీక్షిస్తూ సూచనలు జారీ చేశారు. సాక్ష్యాధారాలు కోర్టుకు హాజరుపరచడం మొదలు నిందితులకు జైలు శిక్ష పడేలా విశేష కృషి చేశారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. దీంతో పోలీసు బందోబస్తు మధ్య నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

ఎల్‌ఎల్‌బీ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో గతేడాది ఆగస్టు-సెప్టెంబరు నెలల్లో నిర్వహించిన సీబీసీఎస్, నాన్ సీబీసీఎస్ ఎల్‌ఎల్‌బీ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ నాల్గవ సెమిస్టర్, ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీ నాలుగు, ఎనిమిది సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేశారు. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఫలితాలు పొందుపర్చినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

ఎస్వీయూ దూరవిద్యా పరీక్షలు వాయిదా

- ఉత్తర్వులు జారీ చేసిన వీసీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఫిబ్రవరి 3వ తేదీ నుంచి నిర్వహించాల్సిన దూర విద్యా పరీక్షలు వాయిదా వేసినట్లు వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని రాక

- తిరుపతిలో కూటమి పార్టీల నేతలతో సమావేశం
- రేపు శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

తిరుపతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ శుక్రవారం తిరుపతికి రానున్నారు. గురువారం కలెక్టరేట్‌కు అందిన సమాచారం ప్రకారం.. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు తిరుపతి చేరుకుని తిరుచానూరు రోడ్డులోని ఓ హోటల్‌లో బస చేస్తారు. అక్కడ జిల్లా ఎమ్మెల్యేలు, కూటమి పార్టీల నేతలతో సమావేశమవుతారు. ఖాళీగా ఉన్న తిరుపతి డిప్యూటీ మేయర్ పదవికి ఫిబ్రవరి 3న ఎన్నిక జరగనున్న నేపథ్యంలో దీనిపై కూటమి పార్టీల నేతలతో చర్చించే అవకాశముంది. శనివారం ఉదయం శ్రీకాళహస్తి చేరుకుని పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఆలయ ఈవో బాపిరెడ్డి తదితరులతో సమావేశమై సమీక్షించనున్నారు.

సబ్ జైళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో జిల్లా అధికారులు ఆ మేరకు పనులకు సిద్ధమయ్యారు. తిరుపతి, సత్యవేడు, శ్రీకాళహస్తి సబ్ జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. తిరుపతిలో 10 నుంచి 12, సత్యవేడులో 10, శ్రీకాళహస్తిలో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

రేపు ఇంటింటా పింఛన్ల పంపిణీ

- లబ్ధి పొందనున్న 2,63,191మంది

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫిబ్రవరి నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను శనివారం ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. పింఛన్ల పంపిణీపై జిల్లా అధికారులతో ఆయన గురువారం టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. శుక్రవారం బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకుని శనివారం ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేయాలన్నారు. 2వ తేదీ ఆదివారం కావడంతో మిగిలిన వారికి 3వ తేదీ పంపిణీ చేయాలని ఆదేశించారు.జిల్లాలోని 691సచివాలయాల పరిధిలో 2,63,191 మందికి ప్రభుత్వం రూ.112.19 కోట్లు మంజూరు చేసిందన్నారు.

ప్రాణదాన పథకానికి 194 మంది ఎంపిక



ప్రాణదాన కమిటీలో రోగులను ఎంపిక చేస్తున్న కమిటీ సభ్యులు

తిరుపతి(వైద్యం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో పేద రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు టీటీడీ నిర్వహిస్తున్న ప్రాణదాన పథకానికి 194 మందిని ఎంపిక చేశారు. స్విమ్స్‌లో గురువారం డైరెక్టర్ ఆర్వీకుమార్ ఆధ్వర్యంలో ప్రాణదాన కమిటీ సమావేశం నిర్వహించారు. ఆర్థిక స్తోమత లేని అర్హులైన నిరుపేద రోగులను వైద్య విభాగాల వారీగా ఉచిత శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. కార్డియోథొరాసిక్ 18, ఎండోక్రైనాలజీ 1, జనరల్ సర్జరీ 3, మెడికల్ ఆంకాలజీ 2, మెడిసిన్ 21, నెఫ్రాలజీ 55, న్యూరాలజీ 36, న్యూరో సర్జరీ 19, గైనకాలజీ 2, రేడియేషన్ ఆంకాలజీ 5, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ 29, సర్జికల్ ఆంకాలజీ 2, యూరాలజీ 1 చొప్పున ఎంపిక చేశారు. ప్రాణదాన పథకానికి దాతలు అండగా నిలవాలని డైరెక్టర్ ఆర్వీకుమార్ కోరారు.

శ్రీవారి సేవలో కేంద్రమంత్రి కుమారస్వామి

తిరుమల, జనవరి30(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున ఆలయంలో జరిగిన తోమాల సేవలో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



పేర్నాడులో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సూళ్లూరుపేట, జనవరి 30 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని పేర్నాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం ప్రజలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పేర్నాడు వైద్యాధికారి సత్యవేటి రమణయ్య ఆధ్వర్యంలో తిరుపతి స్విమ్స్ వైద్యశాల నుంచి వచ్చిన సిబ్బందిచే ఈ పరీక్షలు నిర్వహించారు. ముందుగా క్యాన్సర్ ఏ విధంగా వ్యాపిస్తుంది.. దాని లక్షణాలపై అవగాహన కల్పించారు. పేర్నాడు, రాగన్నపట్టెడ, దామరాయి, కొరిడి, చెరువుమిట్ట ప్రాంతాల నుంచి వచ్చిన 75 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు రమణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది స్వప్న, సురేఖ, ప్రశాంతి, టీడీపీ నాయకులు గొంజి వెంకటేశ్వర్లు, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

గూడూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని కూటమి పార్టీలు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని పేదలకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలాన్ని కేటాయించాలన్నారు. ఇంటి నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ. 5లక్షలు మంజూరు చేయాలన్నారు. ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామన్నారు. సుబ్రమణ్యం, కాలేషా, శశికుమార్, రమేష్, చంద్రయ్య, నారాయణ, శ్రీనివాసమూర్తి, భాస్కర్‌రావు, వెంకటయ్య, తులసి పాల్గొన్నారు.

చేనేత కార్మికుడికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న నెల్లూరుజిల్లా దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు

గూడూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో చేనేత కార్మికుడికి వైద్యఖర్చుల నిమిత్తం గురువారం నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ చెన్నూరు గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు వెంకటరమణయ్య గత రెండు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయనకు రూ.33,020 ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, హరికృష్ణ, శేషు, బాలయ్య, రమణయ్య, రాఘవేంద్ర, సునీల్, బాలమురగయ్య, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

గూడూరు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం ఛారిటీస్ వృద్ధాశ్రమంలో గురువారం ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో ఎగ్గిరెడ్డి ప్రభాకర్, అన్నపూర్ణమ్మ సహకారంతో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విజయ్, శ్రీనివాసులు, రామమోహన్‌రావు, రాము, వెంకటసుబ్బయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరీదేవికి పూజలు


నెత్తిపై బుట్టసారెను తీసుకువస్తున్న మహిళలు

గూడూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారువీధిలోని కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా వాసవీ మహిళా సమాజం ఆధ్వర్యంలో 102 మంది మహిళలు బుట్టసారెను నెత్తిపై పెట్టుకుని స్థానిక శివాలయం నుంచి మంగళవాయిద్యాల నడుమ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయానికి ప్రదర్శనగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి పూజలు జరిపారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

గూడూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని పట్టణ సీఐ శేఖర్‌బాబు అన్నారు. గురువారం పట్టణంలోని పలు కూడళ్లలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో వాహనదారులు తప్పనిసరిగా ధ్రువీకరణపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వేగంగా, మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అతివేగం ప్రమాదాలకు కారణం

గూడూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అతివేగం ప్రమాదాలకు కారణమవుతుందని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. గురువారం స్థానిక ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు రోడ్డుభద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటో నడిపే సమయంలో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించి, లైసెన్స్‌లను దగ్గర ఉంచుకోవాలన్నారు. మద్యంసేవించి వాహనాలను నడిపినా, పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించుకున్నా చట్టపరమైన చర్యలు చేపడుతామన్నారు. ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్, ఏఎంవీఐ శాంతి, సిబ్బంది, ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ ఏర్పాటుకు స్థల పరిశీలన

పెళ్లకూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకూరు, పుల్లూరు గ్రామాల సమీపంలోని స్వర్ణముఖినదిలో ఇసుక రీచ్ ఏర్పాటుకు సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డితో కలసి గురువారం స్థల పరిశీలన చేశారు. రెండు గ్రామాల వద్ద నదిలో రీచ్ కోసం నిర్ణయించిన స్థలం వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీఆర్వో వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు



Er. శ్రీ దాసరి రవీంద్రబాబు–శ్రీమతి రాజ్యలక్ష్మి
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పంచాయతీరాజ్ డివిజను, గూడూరు, తిరుపతి జిల్లా
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగము నందు 36 సం.లు వివిధ హోదాల్లో అంకిత భావంతో పనిచేసి జిల్లా ఉత్తమ ఇంజనీరుగా పలుమార్లు ఉన్నతాధికారుల ప్రశంసలందుకొని గూడూరు పంచాయతీరాజ్ డివిజను ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా తేది:31-01-2025 ఉద్యోగ విరమణ గావించుచున్న, సహృదయులు కార్యదీక్షాపరులు
Er. దాసరి రవీంద్రబాబు B.Tech., గారికి
హృదయపూర్వక శుభాకాంక్షలతో...
పంచాయతీరాజ్ డివిజను ఇంజనీర్లు మరియు సిబ్బంది

ఆంక్షలతో కూడిన అనుమతులు ఇచ్చాం


రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా

కోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి స్వర్ణముఖినదిలో గల ఇసుకరీచ్, విద్యానగర్‌లోని ఇసుక డంపింగ్‌యార్డ్‌లను గురువారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నదిలో రీచ్ ఉండే ప్రదేశాన్ని పరిశీలించారు. ఇక్కడ రీచ్‌కు మరో 15 రోజుల వరకు తవ్వకాలు చేపట్టేందుకు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. 15 రోజుల తరువాత ఇసుక తవ్వకాలు జరుపుతామన్నారు. ఈ తవ్వకాలలో జేసీబీ, హిటాచీలను వాడరాదని, టిప్పర్ల ద్వారా ఇసుక రవాణా చేయకూడదని కఠినమైన ఆంక్షలు విధించామన్నారు. స్థానికంగా గూడలి గ్రామానికి చెందిన పలువురు గ్రామస్థులు వచ్చి రీచ్‌లో తమకు జీవనోపాధి కల్పించాలని కోరారు. దీనిపై కూడా పరిశీలిస్తామని రాఘవేంద్రమీనా తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జయజయరావు, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, సర్వేయర్ గోపీరెడ్డి, ఆర్ఐ మధులత, వీఆర్వోలు మైనింగ్ అధికారులు ఉన్నారు.

మోడల్ పాఠశాలల ఎంపిక పై తనిఖీలు

కోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు, కేశవరం, ఊనుగుంటపాళెం, రుద్రవరం, గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను గురువారం తహసీల్దారు జయజయరావు తనిఖీ చేశారు. సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా ఆదేశాల మేరకు ఆయా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన చేసి మోడల్ పాఠశాలలుగా ఎంపిక చేసేందుకు గాను ఈ తనిఖీలు నిర్వహించారు. మండలంలోని కొన్ని పాఠశాలలను ఎంపిక చేసుకొని, వాటిలో కొన్నింటిని ఉత్తమమైనవిగా ఎంపిక చేసి అధునాతన వసతులు కల్పిస్తామన్నారు.

7న హైదరాబాద్‌లో మాదిగల సభ


డప్పులు కొడుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు ఉదయ్‌కృష్ణ, అంబేడ్కర్, రవి, శ్రీనివాసులు తదితరులు

సూళ్లూరుపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ కోసం ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే హలో మాదిగ.. ఛలో హైదరాబాద్ సభను జయప్రదం చేయాలని ఆ సమితి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు ఎస్.ఉదయ్‌కృష్ణ పిలుపునిచ్చారు. గురువారం సూళ్లూరుపేటలో డివిజన్ స్థాయిలో జరిగిన ఎంఆర్‌పీఎస్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. మాదిగల సభలో లక్ష డప్పులతో మన గొంతులను తెలంగాణ ప్రభుత్వానికి వినిపించాలని అన్నారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు కుక్కమల్లి రవి, అంబేడ్కర్, శ్రీనివాసులు, పెంచలయ్య,వెంకటేశ్వర్లు, చంద్రబాబు, రాజబాబు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు విచారణ

డక్కిలి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును గూడూరు డీఎస్పీ గీతా కుమారి గురువారం విచారించారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల ఆగ్రామానికి చెందిన పాముూరు శ్రీనివాసులుతో పాటు మరికొంత మందిని అదే గ్రామానికి చెందిన బొల్లినేని భాస్కర నాయుడు కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదు అందడంతో డక్కిలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారన్నారు. ఈసంఘటనపై వాస్తవాలుతెలుసుకునేందుకు విచారణచేపట్టామన్నారు. వెంకటగిరి సీఐ ఏవీరమణ, డక్కిలి ఎస్ఐ శివశంకర్ ఉన్నారు.

ఆక్రమణల తొలగింపునకు పటిష్ఠ చర్యలు

నాయుడుపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన కూడలి ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపునకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. గురువారం రాత్రి పాతబస్టాండ్ సమీపంలో ఉన్న ఆక్రమణలను పోలీసులు, మున్సిపల్ సిబ్బంది తొలగించారు. సీఐ మాట్లాడుతూ నాయుడుపేట పట్టణం కూడలి ప్రాంతం కావడంతో రోడ్డుకిరువైపులా ఆక్రమణలు ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ క్రమంలో ఆక్రమణలను తొలగిస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యాగంనగర్ సమీపంలో పట్టణానికి చెందిన నరసింహారావు గురువారం రోడ్డు దాటుతుండగా మోటారు సైకిల్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. నరసింహారావును నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సలు అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల బాలికలకు ఐఐటీ సర్టిఫికెట్లు

నాయుడుపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం పుదూరులోని 12 మంది గురుకుల బాలికలకు చెన్నైలోని ఐఐటీ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ప్రతిభ సర్టిఫికెట్లు అందినట్లు గురుకుల ప్రిన్సిపాల్ రూత్ రమోలా గురువారం తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ డేటా బేస్ ఆన్‌లైన్ కోర్సుల్లో ఈ విద్యార్థినులు రెండు నెలల శిక్షణ అనంతరం ఫైనల్ ఆన్‌లైన్ పరీక్షల్లో ప్రతిభ కనపరచడంతో వారికి సర్టిఫికెట్లు జారీచేసినట్లు తెలిపారు. వీరిని అధ్యాపకులు తన్నీరు శశి, కవిత, పవిత్ర తదితరులు అభినందించారు.

వైసీపీ పాలనలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

నాయుడుపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో అప్పులతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో రూ.10 లక్షల కోట్లు అప్పులు చేశారని, వాటికి ఏడాదికి రూ.71వేల కోట్లు అసలు, వడ్డీ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడేనాటికి రూ.1.40 లక్షల కోట్ల బకాయిల భారాన్ని మోపిందని ఆరోపించారు. తద్వారా ఆర్థిక వ్యవస్థ దివాళా తీసిందని అన్నారు. జగన్ కుటుంబం మాత్రం సుమారు రూ.8 లక్షల కోట్లు వివిధ మార్గాల్లో లూటీ చేసిందని, తద్వారా కూటమి ప్రభుత్వానికి అప్పులు, బకాయిలు గుదిబండగా మారాయన్నారు. ఈ విషయాలను ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత ప్రతి టీడీపీ నాయకుడు, కార్యకర్తకు ఉందని, సోషల్ మీడియాలోకి సైతం ఈ విషయాలను విస్తృతంగా తీసుకెళ్లాలని ఆ ప్రకటనలో ఆయన కోరారు.

పోలీసు హెచ్చరికనూ
లెక్కచేయని మద్యం ప్రియులు


పోలీసు వారి హెచ్చరిక బోర్డు


ఆ స్థలంలోనే వినియోగించి పడేసిన మద్యం పీసాలు, గ్లాసులు

వెంకటగిరిటౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఘోషా ఆస్పత్రిలో పలువురు మద్యం, గంజాయి సేవిస్తున్నారన్న సమాచారం రావడంతో సీఐ ఏవీ రమణ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇక్కడ మద్యపానం, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ బోర్డు ఏర్పాటు చేశారు. అయినా మద్యం ప్రియులు దానిని లెక్కచేయకుండా అక్కడే మద్యం తాగుతున్నారు. వంద సంవత్సరాల చరిత్ర కల్గిన ఘోషా ఆస్పత్రి ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఘోషా ఆస్పత్రిపై నిఘా పెట్టి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్షణికావేశం...

● కర్రతో దాడిచేసి అన్నను చంపిన తమ్ముడు


కోటయ్య మృతదేహం (ఇన్‌సెట్లో ఫైల్‌ఫొటో)

కోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కోట మండలం జరుగుమల్లి గమళ్ల పాళెంలో గురువారం క్షణికావేశంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగి తమ్ముడు కర్రతో దాడిచేయడంతో అన్న కోమారి కోటయ్య (46) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు జరుగుమల్లి గమళ్ల పాళెంకు చెందిన కోమారి కోటయ్య, మస్తానయ్యలు స్వయాన అన్నదమ్ములు. ఇద్దరు పక్కపక్కనే నివాసం ఉంటున్నారు. తమ్ముడు మస్తానయ్య భార్య ఇంటివద్ద బట్టలు ఉతుకుతుడగా వచ్చే మురుగునీరు అన్న కోటయ్య ఇంటిపైకి వెళ్తుండటంతో తోడి కోడళ్లు గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో కోటయ్య, మస్తానయ్య అన్నదమ్ములు ఇరువురు భార్యల తరఫున జోక్యం చేసుకోవడంతో వివాదం తారాస్థాయికి చేరుకుంది. దీంతో రెచ్చిపోయిన తమ్ముడు మస్తానయ్య అక్కడే ఉన్న తండ్రి వెంకయ్య చేతిలోని కర్రను తీసుకొని అన్న కోటయ్య తలపై బలంగా మోదాడు. దీంతో కోటయ్య స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కోటయ్యను కోట ప్రభుత్వాస్పత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని కోటయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఒకే తల్లికి జన్మించిన అన్నదమ్ములు చిన్నపాటి విషయమై క్షణికావేశంలో అన్నను తమ్ముడు చంపడంతో జరుగుమల్లిలోని గమళ్లపాళెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అన్నను కర్రతో దాడిచేసి చంపిన మస్తానయ్య పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన మహాత్మాగాంధీ


గాంధీ చిత్రపటం వద్ద నాయుడుపేటలో నెలవల సుబ్రహ్మణ్యం - గూడూరులో సీపీఎం నేతల నివాళులు

నాయుడుపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అహింసా వాదంతో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన మహనీయుడు మహాత్మా గాంధీ అని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా నాయుడుపేటలో ఆయన చిత్రపటానికి నెలవల సుబ్రహ్మణ్యం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంచి కృష్ణయ్య, గూడూరు సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్, సుజాతమ్మ, కన్నెమ్మ, గోపాలకృష్ణ ఉన్నారు.

గూడూరు: స్థానిక బజారువీధిలోని గాంధీ విగ్రహానికి సీపీఎం నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో జోగి శివకుమార్, మణి, బీవీ రమణయ్య, ప్రసాద్, చంద్రయ్య, మదన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించగా, సోమిశెట్టి చెంచురామయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటగిరిటౌన్: పట్టణంలోని తూర్పువీధిలో ఉన్న గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి అంజయ్య ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అదే విధంగా వెలమ పాళెంలో డిల్లీబాబు ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలయ్య, గౌస్ బాషా, హనుమంతు, తాజుద్దీన్, మునయ్య, ముని బాబు, చంద్రశేఖర్, సతీష్, కాంతారావు పాల్గొన్నారు.

వాకాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అన్నపూర్ణరావు, టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో, తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రామయ్య, డీటీ సందీప్, ఆర్ఐ అఖిల్, పాఠశాలల్లో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెళ్లకూరు: పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ యువరాజు, ఎంఈవో మించల శంకరయ్య గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆర్ఐ సంతోషీ బాయి, వీఆర్వోలు వంశీకృష్ణ, మోబీనా పాల్గొన్నారు.

కోట: కోట పట్టణంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆవుల సుబ్బయ్య ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద సంస్థల నేతలు, షిరిడీసాయి అక్షయసేవాసమితి ప్రతినిధులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

● కిసాన్ మేళాలో అధికారులు, శాస్త్రవేత్తలు


స్టాల్‌లో విద్యార్థులతో నిమ్మచీని పరిశోధన సిబ్బంది


డక్కిలి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సరైన యాజమాన్య పద్ధతులు, జాగ్రత్తలతో అధిక దిగుబడులు సాధించవచ్చని అధికారులు, శాస్త్రవేత్తలు సూచించారు. వెంకటగిరి నియోజకవర్గం డక్కిలిలో గురువారం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనంతరాజుపేట(అన్నమయ్య జిల్లా) ఉద్యాన కళాశాల విద్యార్థులు, పెట్లూరు నిమ్మ పరిశోధన స్థానం సంయుక్తంగా రైతు సదస్సులు నిర్వహించారు. ఉద్యాన కళాశాలలో బీఎస్సీ ఉద్యాన కోర్సు నాల్గవ సంవత్సరం చదుతున్న విద్యార్థులు గ్రామీణ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా డక్కిలిలో 3నెలలుగా రైతులతో కలిసి ఉద్యాన పంటల సాగును పరిశీలించారు. పంటల సాగు మెలకువలు నేర్చుకున్నారు. తాము నేర్చుకున్న అంశాలపై గురువారం రైతుసదస్సు, ఉద్యాన పంటల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీటీ శ్రీనివాస్ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెట్లూరు నిమ్మ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి, ఉద్యాన కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ వై.శిరీష, మండల ఉద్యాన శాఖ అధికారి ఆనంద్, ఉద్యాన కళాశాల ఏడీఆర్ డాక్టర్ బి.హరిమల్లిఖార్జున రెడ్డి, నిమ్మ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కాందర్ నాయక్, ఎంఈవో, ఉన్నత పాఠశాల హెచ్ఎం నాగరాజు ప్రసంగించారు. రైతులు సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. తగిన సూచనలు చేశారు.

ప్రైవేట్ ఫైనాన్స్ వేధింపులకు
గిరిజనుడి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న ప్రకాష్

దొరవారిసత్రం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ వేధింపులకు గిరిజనుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన దొరవారిసత్రం మండలం బుదూరులో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బుదూరు గిరిజన కాలనీకి చెందిన చెంబేటి ప్రకాష్ వ్యవసాయ కూలీ. తన ఇంటిపై ఏపీఎస్‌సీ ఫైనాన్షియల్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ నుంచి యేడాది క్రితం రూ.4 లక్షలు రుణం పొందాడు. ప్రతి నెలా రూ.8 వేలు చెల్లిస్తున్నాడు. మూడు నెలల నుంచి పనులు లేక డబ్బులు చెల్లించక పోవడంతో ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది బుధవారం ఇంటికి వచ్చి గొడవ పడటంతో మనస్థాపానికి గురైన ప్రకాష్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బంధువులు తెలిపారు. గమనించిన బంధువులు అతడిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉన్నట్లు చెప్పారు. ఆస్పత్రి వర్గాల నుంచి దొరవారిసత్రం పోలీసులకు సమాచారం రావడంతో వారు బాధితుడి నుండి వివరాలు సేకరించారు. అయితే ఈ వ్యవహారాన్ని కేసుల వరకు పోనీయకుండా ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకులు మంతనాలు చేస్తున్నట్లు సమాచారం.

జపాన్ రాయబారితో శ్రీసిటీ ఎండీ సమావేశం


ఒకో కెయిచిని సన్మానిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జపాన్ కాన్సుల్ జనరల్ మునియో తకాహషి ఆహ్వానం మేరకు భారత్‌లోని జపాన్ రాయబారి ఒనోకెయిచీ ఆధ్వర్యంలో చెన్నైలో నిర్వహించిన స్వాగత కార్యక్రమానికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి రాయబారిని ఘనంగా సన్మానించారు. శ్రీసిటీ గురించి ఆయనకు వివరించారు. జపనీస్ తయారీ దారులు తమ ప్రధాన వ్యాపార గమ్యస్థానంగా శ్రీసిటీని ఎంపిక చేసుకునేందుకు ఈ ఆటో ఎక్స్‌పో తమకు ఓ అద్భుత వేదిక అని ఆయన పేర్కొన్నారు.

మేరీ వృద్ధాశ్రమానికి చేయూత

నాయుడుపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రాజీవ్ గాంధీకాలనీలోని మేరీ వృద్ధాశ్రమం వృద్ధులకు వాటర్ కూలర్, నిత్యావసర సరుకులను గురువారం కొడవలి రామచంద్రరావు జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు సీటీవో రవికుమార్ అందజేశారు. వృద్ధుల నడుమ కేక్ కట్‌చేసి అందరికి పంపిణీ చేశారు. వృద్ధులను ఆదరిస్తున్న సునీత బెన్నీలను ప్రత్యేకంగా అభినందించారు.

పలమనేరు విద్యార్థినికి
రూ.9.02 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం


విద్యార్థిని పూర్ణిమ

పలమనేరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పలమనేరు మహిళా పాలిటెక్నిక్‌లో డిప్లమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ చివరి సంవత్సరం విద్యార్థిని ఎం.పూర్ణిమ రూ.9.20 లక్షల ప్యాకేజీ ఉద్యోగానికి ఎంపికైంది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్ కంపెనీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో పలమనేరు ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థిని ఎం.పూర్ణిమ ఎంపికయ్యారు. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం చెంబేడుకు చెందిన సిద్ధయ్య, గాయత్రి దంపతుల కుమార్తె పూర్ణిమ రాష్ట్రంలోని 15మందిలో ఒకరిగా నిలిచింది. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జయపాల్, అధ్యాపకులు విద్యార్థినులు పాల్గొన్నారు.

నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో సదుపాయాలు కల్పించాలి

నాయుడుపేట టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్‌కు పలుసేవలు, సదుపాయాలు కల్పించాలని సదరన్ రైల్వే డీఆర్‌ఎంను కోరినట్లు నాయుడుపేటకు చెందిన సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పేర్నాటి జోసెఫ్ తెలిపారు. చెన్నైలోని సదరన్ రైల్వే డీఆర్‌ఎం కార్యాలయంలో బుధవారం రాత్రి డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సమావేశం జరిగిందని జోసెఫ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో చెన్నై ఎక్స్‌ప్రెస్, మధుర ఎక్స్‌ప్రెస్, రామాంతపూర్ ఎక్స్‌ప్రెస్ నిలపాలని కోరినట్లు చెప్పారు. రైల్వే స్టేషన్‌లో వాటర్ కూలర్, ప్యాసింజర్ల షెల్టర్, ఆర్‌పీఎఫ్ ఔట్‌పోస్టు ఏర్పాటుచేయాలని కోరామన్నారు. అసోసియేషన్ సభ్యులు ఎం.మస్తానయ్య, ఆర్.రాఘవన్, కిరణ్, రవి తదితరులు ఉన్నారు.

కలసికట్టుగా టీడీపీని బలోపేతం చేద్దాం

పెళ్లకూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేసి టీడీపీని బలోపేతం చేద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. గురువారం మండలంలోని పునబాక కండ్రిగ గ్రామంలో వేలూరు హరి నాయుడు ఇంటి వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సహకారంతో మండలంలోని అన్ని గామీణ రోడ్లు బాగుపడ్డాయన్నారు. స్వర్ణముఖినది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద నాయుడు, వేలూరు హరి నాయుడు, నాయకులు పునబాక పోలయ్య, నేలవల్లి సిద్ధులయ్య నాయుడు, శాఖమూరి కృష్ణమ నాయుడు, తాళ్ల యుగంధర్ గౌడ్, రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు

ఓజిలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు ఉంటాయని ఎంఈవో శైలజ అన్నారు. గురువారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు చక్కని విద్యాబోధన అందుతోందని చెప్పారు. మధ్యాహ్న భోజనం కూడా మెనూ ప్రకారం అందించాలని సూచించారు.